# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

సంపుటి : 01 సంచిక : 331, ఎడిటర్: మార్పు సాయి కుమార్ పేజీలు : 08, వెల రూ. 5రూ/ శుక్రవారం -04 - ఏప్రిల్ - 2025

Published From, Guntur : Circulatedat,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna,Kurnool ,Srikakulam, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad



విలేకరులు కావలెను

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను.

అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు

సంప్రదించండి: 9398 15 6948


## రాజ్యసభలో వక్ఫ్ సవరణ బిల్లు ప్రవేశపెట్టిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు



- రాజ్యసభలో వక్ఫ్ సవరణ బిల్లు
- వక్ఫ్ ఆస్తుల నిర్వహణపై కేంద్ర మంత్రి రిజిజు స్పష్టీకరణ
- వక్ఫ్ బోర్డులలో మహిళలకు ప్రాధాన్యం
- గిరిజన ఆస్తులకు రక్షణ కల్పిస్తూ వక్ఫ్ బిల్లు సవరణ

2

## కంచ గచ్చిబౌలి భూములపై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు



- ఆ భూములు కొనుగోలు చేస్తే నష్టపోతారని హెచ్చరిక
- తాము అధికారంలోకి వచ్చాక వెనక్కి తీసుకుంటామని వెల్లడి
- రియల్ ఎస్టేట్ బ్రోకర్ లా రేవంత్ రెడ్డి ప్రవర్తిస్తున్నారని మండిపాటు

2

## ఏపీకి రండి.. సన్‌రైజర్స్ జట్టుకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆఫర్



**అమరావతి,:** కాంప్లిమెంటరీ పాసుల వ్యవహారంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మధ్య వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఓ ఆఫర్ ఇచ్చింది. హెచ్‌సీఏతో నెలకొన్ని

2

## వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ నేడు నిరసనలకు పిలుపునిచ్చిన హీరో విజయ్ టీవీకే పార్టీ



2లో

- లోక్ సభలో వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదం
- కేంద్రంపై విపక్షాల విమర్శలు
- వక్ఫ్ సవరణ బిల్లుపై తన వైఖరి వెల్లడించిన టీవీకే పార్టీ
- బిల్లును వెనక్కి తీసుకోవాలంటూ డిమాండ్

## వైసీపీలో మారాల్సింది ఎవరు.. మార్చేది ఎవరు...



**అమరావతి,:** ప్రతిపక్ష హోదా లేకపోవడం వల్ల జగన్ ని పులివెందుల ఎమ్మెల్యే అని ప్రత్యర్థి పార్టీలు పొలిటికల్ ర్యాగింగ్ చేస్తున్నాయి. అవును వైసీపీ ఇపుడు విపక్షంలో ఉంది. ఎన్నడూ లేని సంక్షోభంలో ఉంది. కేవలం 11 సీట్లు మాత్రమే వైసీపీకి ఈ దఫా దక్కాయి అంటే దారుణమైన ఫలితమే కదా అని అంటున్నారు. అంతే కాదు అసెంబ్లీకి వైసీపీ కనీసం వెళ్ళలేని ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడ్డాయని అంటున్నారు. ప్రతిపక్ష హోదా లేకపోవడం వల్ల జగన్ ని పులివెందుల ఎమ్మెల్యే అని ప్రత్యర్థి పార్టీలు పొలిటికల్ ర్యాగింగ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వైసీపీ ఓటమి చెంది పది నెలలు పై దాటుతోంది. మరి పార్టీ పరమైన రిపేర్లు ఉన్నాయా దిద్దుబాట్లు చేసుకుంటున్నారా అన్న చర్చ అయితే ఉంది. జగన్ విషయానికి వస్తే ఆయన ఎక్కువగా బెంగళూరులోనే ఉంటున్నారు అని అంటున్నారు. మిగతా..2లో

# ఇచ్చిన మాట ప్రకారమే పేదలకు 'పట్టా'భిషేకం: నారా లోకేశ్

- పేదలకు ఉచితంగా శాశ్వత గృహ పట్టాలు
- గోవిందు అనే వ్యక్తి కుటుంబానికి స్వయంగా పట్టా అందించిన మంత్రి లోకేశ్
- ముఖ్యమైన హామీని నెరవేర్చడం సంతోషంగా ఉందని వెల్లడి
- మంగళగిరి టీడీపీ కంచుకోటగా మార్చుతానని స్పష్టీకరణ



**అమరావతి,:** రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఉండవల్లిలో దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు ఉచితంగా శాశ్వత గృహ పట్టాలను అందించే కార్యక్రమాన్ని మిగతా..2లో

## మిథున్ రెడ్డికి షాకిచ్చిన హైకోర్టు



2లో

- వైసీపీ హయాంలో మద్యం కుంభకోణం జరిగిందని కేసు
- ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన మిథున్ రెడ్డి
- మిథున్ రెడ్డి పిటిషన్ ను కొట్టివేసిన హైకోర్టు

## మంత్రివర్గ విస్తరణ పై ఊహించని నిర్ణయం

### - వారికే ఛాన్స్..!!

- ఆరు స్థానాలు ఖాళీ ఉండగా..
- తుది జాబితా ఖరారులో కొత్త ట్విస్ట్ లు ఇస్తోంది
- నలుగురి పేర్లు దాదాపు ఖరారయ్యాయి
- మంత్రివర్గ విస్తరణలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని స్పష్టం చేసారు
- ఇద్దరు బీసీల కు అవకాశం ఇవ్వాలని పార్టీ నిర్ణయం
- బెర్తుల ఖరారు పైన పార్టీలో ఉత్కంఠ



**హైదరాబాద్, :** తెలంగాణ మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు. విస్తరణ ఖాయమైన వేళ అనూహ్య పరిణామాలు తెర మీద కు వస్తున్నాయి. పార్టీ అధినాయకత్వం తుది జాబితా ఖరారులో కొత్త ట్విస్ట్ లు ఇస్తోంది. ఇప్పటికే నలుగురి పేర్లు ఖరారైనట్లు ప్రచారం సాగుతోంది. కాగా, అందులో ఇద్దరి పేర్ల పైన పార్టీ ముఖ్య నేత రాహుల్ గాంధీ అభ్యంతరం వ్యక్తం చేసారు. ఇదే సమయంలో ఢిల్లీలో మిగతా..2లో

## అసెంబ్లీలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ఆగ్రహం




- కోర్టు విచారణలో ఉన్న అంశంపై వ్యాఖ్యలు చేయడమేంటని ఫైర్
- బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తికి సంయమనం అవసరమని హితవు
- ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు విచారణలో జస్టిస్ బీఆర్ గవాయి ఆగ్రహం

**న్యూఢిల్లీ,:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయి ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా..2లో

# చైనాకు అమెరికా సుంకాల దెబ్బ...

### భారత్ కు ఫేవర్ అంటున్న నిపుణులు

- చైనాపై 65 శాతానికి మించి అమెరికా సుంకాలు
- భారత్ పై అమెరికా సుంకాలు 27 శాతమేనంటున్న నిపుణులు
- భారత్‌కు అనుకూలంగా మారనున్న వాణిజ్య పరిస్థితులు
- ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లో భారీ వృద్ధికి అవకాశం
- ఎలక్ట్రిక్ వాహన రంగంలో అవకాశాలు



వివరాలు 2లో..

ఢిల్లీ: అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో, అమెరికా సుంకాల భారం చైనాపై ఎక్కువగా పడుతోంది. దీనివల్ల భారతీయ ఎగుమతులకు కొత్త అవకాశాలు తెరుచుకోనున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. చైనాపై అమెరికా సుంకాలు 65% లేదా అంతకంటే ఎక్కువ ఉండగా, భారత్‌పై సుంకాలు 27% మాత్రమే ఉన్నాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో భారతీయ ఉత్పత్తులకు మరింత గిరాకీ లభిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మార్కెట్ వర్గాల ప్రకారం... ముఖ్యంగా సాంకేతిక ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్, రత్నాలు, ఆభరణాలు, వస్త్రాలు వంటి రంగాల్లో భారత్ దూసుకుపోయే అవకాశం ఉంది.

## ఆ వ్యవహారంలో నాకు, సిద్ధార్థరెడ్డికి సంబంధం లేదు



2

- అదుదాం ఆంధ్రలో ఎలాంటి అవినీతి జరగలేదన్న రోజా
- వైసీపీలోని బలమైన నేతలపై కేసులు పెడుతున్నారని విమర్శ
- ఇచ్చిన హామీల అమలు కోసం ప్రభుత్వం పని చేయాలని హితవు

## థాయ్ మహిళా ప్రధాని షినవత్రా నుంచి ప్రధాని మోదీకి విశిష్ట కానుక



- థాయ్‌లాండ్ లో పర్యటిస్తున్న ప్రధాని మోదీ
- థాయ్ ప్రధాని షినవత్రాతో ద్వైపాక్షిక సమావేశం
- ఈ సందర్భంగా మోదీకి తిపిటక గ్రంథం బహూకరణ

**న్యూఢిల్లీ,:** భారత ప్రధాని నరేంద్ర మోదీకి థాయ్‌లాండ్ ప్రధాని పెటోంగ్‌టార్న్ షినవత్రా విశిష్ట కానుకను అందజేశారు. బ్యాంకాక్‌లో జరిగిన ద్వైపాక్షిక చర్చల సందర్భంగా మిగతా..2లో

# రాజ్యసభలో వక్ఫ్ సవరణ బిల్లు ప్రవేశపెట్టిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు

**న్యూఢిల్లీ,:** కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు నేడు రాజ్యసభలో వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. లోక్‌సభలో 12 గంటల సుదీర్ఘ చర్చ అనంతరం ఆమోదం పొందిన మరుసటి రోజే ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. వక్ఫ్ ఆస్తులను ముస్లిమేతరులు నిర్వహిస్తారనే తప్పుడు అభిప్రాయాన్ని ప్రతిపక్షాలు వ్యాప్తి చేస్తున్నాయని, అందులో నిజం లేదని రిజిజు స్పష్టం చేశారు. వక్ఫ్ బోర్డు భారీ భూ బ్యాంకును కలిగి ఉన్నప్పటికీ ముస్లిం సమాజం ఎలా బాధపడుతోందో సచార్ కమిటీ నివేదిక పేర్కొన్న వైనాన్ని ఆయన ఉటంకించారు. రాజ్యసభలో రిజిజు మాట్లాడుతూ కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం 2013లో వక్ఫ్ బిల్లుకు సవరణలు చేసిందని, ఆ తప్పులను తాము తాజాగా చేసిన సవరణలు ఎలా సరిదిద్దుతాయో కూడా వివరించి చెప్పారు. వక్ఫ్ ఆస్తుల దుర్వినియోగాన్ని 2013లో సెలెక్ట్ కమిటీ అంగీకరించిందని, దేశంలోనే ఇది మూడవ అతిపెద్ద భూ యజమానిగా ఉన్నప్పటికీ, మైనారిటీ వర్గానికి ప్రయోజనం చేకూర్చేందుకు వనరులను సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైందని అన్నారు. వక్ఫ్ బోర్డుల కూర్పు గురించి వివరిస్తూ... కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో వక్ఫ్ బోర్డుల పాలకవర్గాల్లో మహిళా సభ్యులను చేర్చడానికి సంబంధించి ఒక ముఖ్యమైన సంస్కరణను తీసుకువచ్చామని మంత్రి తెలిపారు. కేంద్ర వక్ఫ్ మండలిలో 10 మంది సభ్యులు ఉంటారని, అందులో ఇద్దరు మహిళలు తప్పనిసరిగా ఉండాలని, నలుగురు వ్యక్తులు భారత ప్రభుత్వ అదనపు కార్యదర్శి వంటి జాతీయ స్థాయి ప్రముఖులు ఉంటారని కిరణ్ రిజిజు వివరించారు. రాష్ట్రాల్లోని వక్ఫ్ బోర్డులో 11 మంది సభ్యులు ఉంటారని, అందులో ముగ్గురు ముస్లిమేతరులు ఉండవచ్చని, ఇద్దరు మహిళలు తప్పనిసరిగా ఉండాలని ఆయన అన్నారు. వక్ఫ్ బోర్డులోని సెక్షన్ 40ను రద్దు చేశామని, దీని ద్వారా ఏ ఆస్తి అయినా తమదేనని మతపరమైన సంస్థ క్లెయిమ్ చేసే అధికారం ఉండేదని తెలిపారు. ప్రభుత్వ భూమిని వక్ఫ్ క్లెయిమ్ చేయకూడదని, షెడ్యూల్డ్ తెగల ఆస్తులను మార్చడానికి వీల్లేదని, వాటిని వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించకూడదని స్పష్టం చేశారు. ఈ మేరకు రెండు పెద్ద సవరణలను చేశామని రిజిజు రాజ్యసభకు తెలియజేశారు.

## కంచ గచ్చిబౌలి భూములపై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, :** కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి నెలకొన్న వివాదంపై మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ భూములను ఎవరూ కొనుగోలు చేయవద్దని హెచ్చరించారు. ఎవరైనా కొనుగోలు చేస్తే నష్టపోతారని చెప్పారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక కేజీఎఫ్ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. కేజీఎఫ్ భూములు 400 ఎకరాలను గ్రీన్ జోన్ గా ప్రకటించి, ఎకో పార్క్ గా తీర్చిదిద్ది హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్ సీయూ)కి కానుకగా ఇవ్వాలని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించినట్లు తెలిపారు. కేజీఎఫ్ భూములు హైదరాబాద్ ప్రజలకు చెందినవని, ఈ భూములను అమ్మే ఆలోచనను మానుకోవాలని ప్రభుత్వానికి కేటీఆర్ హితవు పలికారు. ఈ విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గే దాకా ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్ ప్రజల భవిష్యత్తు కోసం బీఆర్‌ఎస్ పోరాడుతుందని తెలిపారు. ఈ మేరకు గురువారం తెలంగాణ భవన్ లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ బ్రోకర్ లాగా ప్రవర్తిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓవైపు యూనివర్సిటీ విద్యార్థులు, మరోవైపు పర్యావరణ ప్రేమికులు, ప్రతిపక్షాలు కేజీఎఫ్ భూముల పరిరక్షణ కోసం ఉద్యమిస్తున్నా రేవంత్ రెడ్డి పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఈ విషయంలో బీఆర్‌ఎస్ పార్టీ విధానం స్పష్టంగా వెల్లడించామని, కాంగ్రెస్ పార్టీ విధానం ఏమిటనేది స్పష్టం చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

మంత్రులు తెలిసీతెలియకుండా మాట్లాడుతున్నారు..

కేజీఎఫ్ భూములు నిజంగా ప్రభుత్వానికి చెందినవే అయితే దొడ్డిదారిన ఎందుకు వెళుతున్నారంటూ ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. అర్ధరాత్రులు చెట్లను నరికివేస్తున్నారని ఆరోపించారు. మంత్రులు తెలిసీతెలియకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య స్ఫూర్తి కొరవడిందని, కోర్టులు చెప్పినా ప్రభుత్వం వినిపించుకోవడంలేదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో చెట్లను పెంచి రాష్ట్రంలో హరిత విప్లవానికి తెరలేపామని, కాంగ్రెస్ పార్టీ మాత్రం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతోందని విమర్శించారు.

## వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ నేడు నిరసనలకు పిలుపునిచ్చిన హీరో విజయ్ టీవీకే పార్టీ

**న్యూఢిల్లీ,:** తమిళ సూపర్ స్టార్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రేపు తమిళనాడు వ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చింది. సుదీర్ఘ చర్చల అనంతరం నిన్న లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ వివాదాస్పద బిల్లుపై విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో టీవీకే పార్టీ కూడా తన వైఖరి వెల్లడించింది. అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు చేపట్టేందుకు టీవీకే ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రజల భాగస్వామ్యం ఎక్కువగా ఉండేలా నిరసనలను సమర్థవంతంగా నిర్వహించాలని అధినేత విజయ్ తన పార్టీ జిల్లా కార్యదర్శులకు సూచించారు. వక్ఫ్ (సవరణ) బిల్లు-2025 రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. లోక్‌సభలో బిల్లుకు అనుకూలంగా 288 మంది సభ్యులు ఓటు వేయగా, 232 మంది వ్యతిరేకించారు. ప్రతిపక్షాల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైనప్పటికీ, ప్రతిపాదించిన సవరణలన్నీ వాయిస్ ఓటు ద్వారా తిరస్కరించబడ్డాయి. ఎన్డీయే ఈ బిల్లు మైనారిటీ వర్గాలకు సాధికారత కల్పించే లక్ష్యంతో రూపొందించామని సమర్థించుకుంది. అయితే ప్రతిపక్ష పార్టీలు దీనిని 'ముస్లిం వ్యతిరేకం' అని విమర్శించాయి. ప్రభుత్వం లౌకిక విలువలను దెబ్బతీస్తోందని ఆరోపించాయి. భారతదేశంలో మైనారిటీలు మెరుగైన రక్షణ లభిస్తోందని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వాదించారు. "ప్రపంచంలో భారతదేశం కంటే సురక్షితమైన ప్రదేశం మైనారిటీలకు మరొకటి లేదు. భారతదేశంలో మెజారిటీ ప్రజలు పూర్తిగా లౌకికవాదులు కాబట్టి, మైనారిటీలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రక్షణ పొందుతున్నారు" అని మంత్రి రిజిజు చర్చ సందర్భంగా అన్నారు.

## మిథున్ రెడ్డికి షాకిచ్చిన హైకోర్టు

**అమరావతి,:** వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి ఏపీ హైకోర్టు షాకిచ్చింది. మద్యం కుంభకోణం కేసులో మిథున్ రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ ను కొట్టివేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం కుంభకోణం జరిగిందని గత ఏడాది సెప్టెంబర్ 23న సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో తన పేరు చేర్చి అరెస్ట్ చేస్తారేమో అనే అనుమానంతో హైకోర్టును మిథున్ రెడ్డి ఆశ్రయించారు. ఈ పిటిషన్ పై మార్చి 24న హైకోర్టులో వాదనలు జరిగాయి. తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు... మార్చి 3న తీర్పును వెలువరిస్తామని... అప్పటి వరకు మిథున్ రెడ్డిని అరెస్ట్ చేయవద్దని పోలీసులను ఆదేశించింది. ఈరోజు మిథున్ రెడ్డి పిటిషన్ ను కొట్టివేస్తూ తీర్పును వెలువరించింది. వాదనల సందర్భంగా సీఐడీ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపిస్తూ... ఈ కేసులో మిథున్ రెడ్డిని నిందితుడిగా చేర్చలేదని, ఆయనకు నోటీసులు ఇవ్వలేదని, విచారణకు హాజరు కావాలని ఆదేశించలేదని కోర్టుకు తెలిపారు. ఎఫ్ఐఆర్ లో పేరు లేనప్పుడు బెయిల్ కోరడానికి వీల్లేదని చెప్పారు.

## ఆ వ్యవహారంలో నాకు.. సిద్ధార్థరెడ్డికి సంబంధం లేదు

**అమరావతి,:** ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై ఇంతవరకు కేసులు నమోదు కాలేదని వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి రోజా అన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి అసెంబ్లీలో అన్ని విషయాలు స్పష్టంగా చెప్పామని తెలిపారు. ఆడుదాం ఆంధ్రలో ఎలాంటి అవినీతి జరగలేదని... అంతా నిబంధనల ప్రకారమే జరిగిందని చెప్పారు. ఈ వ్యవహారంలో తనకు, బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి ఎలాంటి సబంధం లేదని చెప్పారు. ఆడుదాం ఆంధ్రలో అంతా పారదర్శకంగా జరిగిందని తెలిపారు. వైసీపీలో ఉన్న బలమైన నేతలను తొక్కడానికి తప్పుడు కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తారనే భయంతోనే కేసులు పెడుతున్నారని విమర్శించారు. తనను అరెస్ట్ చేసి సంబరాలు చేసుకోవాలనే ఆశ వారికి ఉందని చెప్పారు. పేర్ని నాని, కొడాలి నాని, అంబటి రాంబాబును అరెస్ట్ చేయాలని చూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో మహిళలపై దారుణాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రోజా విమర్శించారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం కుప్పంలో కూడా గంజాయి పండిస్తున్నారని చెప్పారు. పోలీసులు టీడీపీ కార్యకర్తల్లా మారిపోయారని విమర్శించారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల్లో కూడా పోలీసులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని అన్నారు. రెడ్ బుక్ కోసం కాకుండా... ఇచ్చిన హామీల అమలు కోసం ప్రభుత్వం పని చేయాలని చెప్పారు.

## చెన్నైలో కార్ల్ మార్క్స్ విగ్రహం: సీఎం స్టాలిన్

చెన్నై: జర్మన్ తత్వవేత్త, సోషలిస్టు నేత కార్ల్ మార్క్స్ విగ్రహాన్ని చెన్నైలో ప్రతిష్టించనున్నట్లు తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. కార్ల్ మార్క్స్ కాలంలోనే లేబర్ ఉద్యమం ఓ శతాబ్దం పాటు సాగింది. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సభ్యుడు పీకే మూకియా థీవర్ స్మారక భవనాన్ని మధురై జిల్లాలో నిర్మించనున్నట్లు సీఎం స్టాలిన్ చెప్పారు. అసెంబ్లీలో రూల్ 110 కింద సుమోటో ప్రకటన చేశారు. ప్రపంచ నేత కార్ల్ మార్క్స్‌కు ద్రవిడ మోడల్ ప్రభుత్వం నివాళి అర్పించనున్నట్లు తెలిపారు. మార్క్స్ ఓ విజనరీ నేత అని, ఉద్యమకారుడని, కమ్యూనిజం ఫిలాసఫీని రూపొందించారని, ప్రపంచ కార్మికులను ఏకం చేశారని ఆయన అన్నారు.

## థాయ్‌లాండ్ పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీ

ఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ థాయ్‌లాండ్ పర్యటనకు వెళ్లారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం థాయ్ రాజధాని బ్యాంకాక్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానికి అక్కడ ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం లభించింది. థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్ర ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ థాయ్ పర్యటకు వెళ్లారు. ఆ దేశంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పేటోంగ్టార్న్‌తో భేటీ కానున్నారు. ఏప్రిల్ 4వ తేదీన బ్యాంకాక్‌లో జరగనున్న 'బే ఆఫ్ బెంగాల్ ఇనీషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్' కూటమి సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశంలో వాణిజ్యం, పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలంపై దేశాధినేతలతో చర్చించనున్నారు. ఇక థాయ్‌లాండ్ పర్యటనను ముగించుకొని ప్రధాని ఏప్రిల్ 4న శ్రీలంక వెళతారు. ఏప్రిల్ 6వ తేదీ వరకూ ఆ దేశంలో పర్యటించనున్నారు. ఆ దేశాధ్యక్షుడు అనురకుమార దిసనాయకే గతేడాది భారత్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన ఆహ్వానం మేరకు మోదీ శ్రీలంక పర్యటనకు వెళ్లబోతున్నారు. మోదీ తన పర్యటనలో రెండు దేశాల మధ్య కుదిరిన పలు ఒప్పందాలపై చర్చించనున్నారు.

# మంత్రివర్గ విస్తరణ పై ఊహించని నిర్ణయం

మొదటి పేజి తరువాయి



ఇదే సమయంలో ఢిల్లీలో మకాం వేసిన టీపీసీసీ నేతలు హైకమాండ్ తో విస్తరణ అంశం పైన చర్చించారు. దీంతో.. ఇప్పుడు మంత్రివర్గ విస్తరణ వేళ ఊహించని విధంగా కొత్త సమీకరణాలు మొదలయ్యాయి. తెలంగాణ లో సుదీర్ఘ నిరీక్షణ తరువాత మంత్రివర్గ విస్తరణ కు పార్టీ అధినాయకత్వం ఆమోదం తెలిపింది. ఆరు స్థానాలు ఖాళీ ఉండగా.. అయిదుగురితో తొలుత భర్తీ చేయాలని నిర్ణయించింది. నలుగురి పేర్లు దాదాపు ఖరారయ్యాయి. సుదర్శనరెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, శ్రీహరి, వివేక్ పేర్లు ఖాయమైనట్లు ప్రచారం జరిగింది. కాగా, రాహుల్ గాంధీ ఇందులో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేరు పైన ప్రశ్నించినట్లు సమాచారం. కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రిగా ఉండగా.. రాజగోపాల్ రెడ్డి కి అవకాశం ఇవ్వటం ఏంటనేది రాహుల్ ప్రశ్న. పార్టీలో చేరే సమయంలో ఇచ్చిన హామీల మేరకు వారిద్దరికీ మంత్రి పదవులు ఇవ్వాలని నిర్ణయించినట్లు పార్టీ నేతలు స్పష్టం చేసారు. అయితే, తాము చర్చించి నిర్ణయం తీసుకునే వరకు వేచి చూడాలని రాహుల్ పార్టీ రాష్ట్ర నేతలకు సూచించినట్లు తెలుస్తోంది. దీంతో, తాజాగా టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మంత్రివర్గ విస్తరణ పైన అసలు విషయం బయట పెట్టారు. మంత్రివర్గ విస్తరణలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని స్పష్టం చేసారు. రాష్ట్రం నుంచి పార్టీలోని అందరి అభిప్రాయాలు తీసుకున్నారని వెల్లడించారు. పార్టీలో వచ్చిన ఇబ్బందులు తొలిగిన తరువాత అధినాయకత్వం విస్తరణ పైన నిర్ణయం తీసుకుంటుంద ని చెప్పుకొచ్చారు. మంత్రివర్గ విస్తరణ ఇప్పుడు పూర్తిగా హైకమాండ్ పరిధిలోని అంశంగా మహేష్ గౌడ్ పేర్కొన్నారు. ప్రాంతాలు - సామాజిక సమీకరణాల ఆధారంగా పార్టీ నాయకత్వం విస్తరణ పైన తుది నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు. ఇప్పటికే నలుగురు పేర్లు మంత్రులుగా ఖరారైనట్లు ప్రచారం సాగుతోంది. కాగా, రాజగోపాల్ రెడ్డి పేరు విషయంలో రాహుల్ గాంధీ ప్రస్తావనతో ఇప్పుడు ఆయనకు చివరి నిమిషంలో అవకాశం దక్కుతుందా లేదా అనేది సస్పెన్స్ గా మారుతోంది. రాజగోపాల్ రెడ్డికి ఛాన్స్ లేకుంటే ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి మరో ముఖ్య నేత పేరు లిస్టులో చేరే అవకాశం ఉంది. అదే విధంగా ఈ సారి విస్తరణ లో మైనార్టీ వర్గానికి ఖాయమని తెలుస్తోంది. జానారెడ్డి లేఖతో ఉమ్మడి రంగారెడ్డి - హైదరా బాద్ నేతలకు అవకాశం ఇవ్వాలని హైకమాండ్ ఆలోచనతో ఉన్నట్లు సమాచారం. ఇద్దరు బీసీల కు అవకాశం ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది. దీంతో, మంత్రివర్గ విస్తరణ.. బెర్తుల ఖరారు పైన పార్టీలో ఉత్కంఠ కొనసాగుతోంది.

## అసెంబ్లీలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

**న్యూఢిల్లీ,:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తులు సంయమనంతో వ్యవహరించాలని హితవు పలికారు. కోర్టు విచారణలో ఉన్న అంశంపై వ్యాఖ్యలు చేయొద్దని సూచించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ గవాయి ఈ వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులకు సంబంధించిన పిటిషన్ పై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. బీఆర్‌ఎస్ తరఫు న్యాయవాది ఆర్యమా సుందరం వాదనలు వినిపిస్తూ.. ఇటీవల అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కోర్టులో ప్రస్తావించారు. 'రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావు' అంటూ రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై జస్టిస్ బీఆర్ గవాయి తీవ్రంగా స్పందించారు. ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండి కోర్టు పరిధిలో ఉన్న అంశంపై సంయమనం పాటించాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై తమకు పూర్తి గౌరవం ఉందని, మిగతా రెండు వ్యవస్థల నుంచి అలాంటి గౌరవాన్ని తాము కోరుకుంటున్నామని ఆయన అన్నారు.

స్పీకర్ ను కూడా కోర్టులో నిలబెట్టాం..

స్పీకర్ సర్వస్వతంత్రుడని, ఆయనను కోర్టులు శాసించలేవన్న వాదనపై జస్టిస్ బీఆర్ గవాయి సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ ఫిరాయింపులపై న్యాయస్థానాలు చేతులు కట్టుకుని కూర్చోవాలా అని ప్రశ్నించారు. గతంలో కోర్టు ధిక్కరణ కేసులో అసెంబ్లీ స్పీకర్‌ను కోర్టులో నిలబెట్టామనే విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. ఫిరాయింపులపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే రాజ్యాంగాన్ని అవమానపరిచినట్లేనని జస్టిస్ బీఆర్ గవాయి పేర్కొన్నారు.

## ఇచ్చిన మాట ప్రకారమే పేదలకు 'పట్టా'భిషేకం: నారా లోకేశ్

మొదటి పేజి తరువాయి



పేదలకు ఉచితంగా శాశ్వత గృహ పట్టాలను అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా, 15 సంవత్సరాలుగా కొండవాలు ప్రాంతంలో నివసిస్తున్న రాజమండ్రి గోవిందు కుటుంబానికి స్వయంగా వారి ఇంటికి వెళ్లి కొత్త బట్టలు పెట్టి శాశ్వత పట్టాను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పేదలకు 'పట్టా'భిషేకం చేస్తున్నామని, ముఖ్యమైన హామీని నెరవేర్చడం సంతోషంగా ఉందన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో అటవీ, దేవాదాయ, రైల్వే, ఇరిగేషన్ భూముల్లో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న ప్రజల కష్టాలను చూశానని, వారికి శాశ్వత పట్టాలు ఇవ్వాలని నిర్ణయించానని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు మూడు విడతలుగా శాశ్వత పట్టాలు ఇవ్వాలని నిర్ణయించామని, మొదటి విడతలో 150 గజాల్లోపు ఉంటున్న 3 వేల మందికి పట్టాలు ఇస్తున్నామని, రెండో విడతలో ఎండోమెంట్స్, రైల్వే భూముల్లో నివసించేవారికి, మూడో విడతలో మిగిలిన వారందరికీ పట్టాలు అందజేస్తామని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. 2019 ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ, మంగళగిరి ప్రజల మనస్సు గెలుచుకోవడానికి గత ఐదేళ్లుగా తన సొంత నిధులతో 26 సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు లోకేశ్ తెలిపారు. ఉచిత తాగునీటి ట్యాంకర్లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణం, కరోనా సమయంలో ఆక్సిజన్, టెలీ మెడిసిన్ సేవలు, ఎన్టీఆర్ సంజీవని ఆరోగ్య రథాలు, యువత కోసం క్రీడా పోటీలు వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రజలు తనపై నమ్మకంతో 91 వేల భారీ మెజారిటీతో గెలిపించారని, ఇది తన బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. మంగళగిరిలో 50 అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమం ద్వారా పార్కులు, రైతు బజార్లు అభివృద్ధి చేస్తున్నామని లోకేశ్ తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పైప్ లైన్ ద్వారా గ్యాస్ వంటి ప్రాజెక్టులు సిద్ధమవుతున్నాయని, శ్మశాన వాటికలు అభివృద్ధి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. త్వరలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని, చేనేతలకు కామన్ ఫెసిలిటీ సెంటర్, స్వర్ణకారులకు జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్కు ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మంగళగిరిని తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా మారుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## థాయ్ మహిళా ప్రధాని షినవత్రా నుంచి ప్రధాని మోదీకి విశిష్ట కానుక

మొదటి పేజి తరువాయి



బ్యాంకాక్‌లో జరిగిన ద్వైపాక్షిక చర్చల సందర్భంగా 'ది వరల్డ్ తిపిటక: సజ్జాయ ఫొనెటిక్ ఎడిషన్' పేరు గల బౌద్ధ గ్రంథాన్ని మోదీకి బహూకరించారు. ఈ చర్య భారత్, థాయ్‌లాండ్ మధ్య బలమైన సాంస్కృతిక, భాషాపరమైన, మతపరమైన సంబంధాలకు నిదర్శనంగా నిలుస్తోంది. 'తిపిటక' అంటే పాలీ భాషలో 'మూడు బుట్టలు'. ఇది బౌద్ధ ధర్మ గ్రంథాలలో ప్రధానమైనది. ఇందులో బౌద్ధ సన్యాసుల నియమాలు, సూత్రాలు, బోధనలు సంగ్రహించబడి ఉంటాయి. ఈ గ్రంథం మొత్తం 108 సంపుటాలుగా ఉంది. థాయ్ ప్రభుత్వం రాజు భూమిబల్ అతుల్యతేజ్ (రామ-9), రాణి సిరికిట్ 70వ వార్షికోత్సవం సందర్భంగా 2016లో 'వరల్డ్ తిపిటక ప్రాజెక్ట్'లో భాగంగా ఈ ప్రత్యేక ఎడిషన్‌ను ప్రచురించింది. పాలి, థాయ్ లిపులలో రూపొందించబడిన ఈ గ్రంథం, తొమ్మిది మిలియన్లకు పైగా పదాలను కలిగి ఉంది. అంతేకాకుండా, ఇది కచ్చితమైన ఉచ్ఛారణతో పఠించేందుకు వీలుగా రూపొందించబడింది. కానుక అందుకున్న సందర్భంగా ప్రధాని మోదీ స్పందిస్తూ, "ప్రధాని షినవత్రా నాకు తిపిటకను బహుమతిగా ఇచ్చారు. లార్డ్ బుద్ధుని పుణ్యభూమి అయిన భారతదేశం తరపున నేను దానిని వినయంగా స్వీకరించాను. గత సంవత్సరం, భారతదేశం లార్డ్ బుద్ధుని పవిత్ర అవశేషాలను, ఇద్దరు ప్రధాన మతగురువులను థాయ్‌లాండ్‌కు పంపింది. దాదాపు నాలుగు మిలియన్ల మంది ప్రజలు ఆ అవశేషాలకు నివాళులర్పించారని తెలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది" అని అన్నారు. థాయ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, థాయ్‌లాండ్ రాజులు బౌద్ధమత సంరక్షకులుగా ఉండటంతో పాటు, తిపిటకను ఇతర దేశాలకు వ్యాప్తి చేయడంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

# వైసీపీలో మారాల్సింది ఎవరు.. మార్చేది ఎవరు...

మొదటి పేజి తరువాయి

జగన్ విషయానికి వస్తే ఆయన ఎక్కువగా బెంగళూరులోనే ఉంటున్నారు అని అంటున్నారు. పార్టీకి అందుబాటులో ఉండాల్సిన వేళ ఆయన ఈ విధంగా చేయడం పట్ల కూడా చర్చ సాగుతోంది. జగన్ మారాలి అని అంటున్న వారూ ఉన్నారు. అయితే ఎట్టకేలకు జగన్ లో కొంత మార్పు అయితే కనిపిస్తోంది అని అంటున్నారు. లోక్ బాడీ ఎన్నికలో అధికార కూటమిని ఎదిరించి ప్రాణాలు ఒడ్డి మరీ పార్టీని గెలిపించిన వారితో జగన్ భేటీ కావడమే ఈ మార్పు అని అంటున్నారు నిజానికి చూస్తే ఇటువంటి సమావేశాలు వైసీపీలో జరిగిన సందర్భాలు అయితే లేవు ఇవన్నీ టీడీపీ లాంటి పార్టీలలో జరుగుతాయి. వైసీపీలో క్యాడర్ లీడర్ ల మధ్య అనుసంధాన ప్రక్రియ కొంచెం కష్టంగానే ఉంటుంది అయితే ఇపుడిపుడే వైసీపీ అధినాయకత్వం వాస్తవాలను తెలుసుకుంటోంది అని అంటున్నారు. అందుకే పార్టీ కోసం కొమ్ము కాసిన వారిని జగన్ తన వద్దకు పిలిపించుకుని అభినందించడం జరుగుతోంది అని అంటున్నారు. అంతే కాదు ఉమ్మడి అనంతపురం జిల్లా రాప్తాడులో హత్యకు గురి అయిన కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు కూడా తాను వస్తాను అని జగన్ చెప్పడం ఆ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిలో ధైర్యం నింపడం వంటివి నిజంగా ఆహ్వానించతగిన పరిణామాలే అని అంటున్నారు. వైసీపీలో జగనే కీలకం. ఆయనతోనే పార్టీ ఉంది. ఆయన చుట్టూనే పార్టీ అల్లుకుంది. అధికారంలో ఉన్నపుడు కూడా వైసీపీ పెద్దలు అదే చెప్పేవారు. తాము ఎవరిని నిలబెడితే వారే గెలుస్తారు అని కూడా గట్టిగా మాట్లాడేవారు. అంతకు ముందు 2014 నుంచి 2019 మధ్యలో కూడా జగన్ ఒక్కరే జనంలోకి వెళ్ళారు. ఆయనే పోరాటాలు చేశారు. ఆయనే పాదయాత్ర చేశారు. అన్ని నిరసన కార్యక్రమాలలో ఆయనే పాలు పంచుకున్నారు. అలా నిత్యం జనంలో జగన్ ఉండడం వల్లనే పార్టీ కూడా బలంగా మారింది. క్యాడర్ కి లీడర్ కి ఉత్తేజం కలిగింది. కానీ ఇపుడు చూస్తే అధినేత కాకుండా పార్టీ నేతలను జనంలోకి వెళ్ళమంటే ఎలా అన్న చర్చ వస్తోంది. ఒకవేళ వెళ్ళినా వారి వల్ల వచ్చేది పెద్దగా ఏమి ఉంటుంది అని కూడా అంటున్నారు. జగన్ కి ప్రజాదరణ ఉంది. ఆయన మాస్ లీడర్. ఆయనే కూటమి ప్రభుత్వానికి ఎదురొడ్డి జనంలో నిలిస్తేనే ఆయన వెంట క్యాడర్ కూడా పరుగులు తీస్తుంది అని అంటున్నారు. వైసీపీ అధినాయకత్వంలో ఈ మార్పు రావాలని అంటున్నారు అయితే జగన్ కూడా జనంలోకి వెళ్ళాలనే అనుకుంటున్నారు అంటున్నారు. ఒక ఏడాది పాటు అయినా ఈ ప్రభుత్వానికి గడువు ఇచ్చి ఆ మీదట జనంలోకి వెళ్తే ఆ ఇంపాక్ట్ వేరేగా ఉంటుందని ఆయన ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. ఆ ఆలోచన బాగానే ఉన్నా ఈలోగా అయినా క్యాడర్ వద్దకు వెళ్తూ పార్టీ కోసం ఇబ్బందులు పడుతున్న వారిని పరామర్శిస్తూ ఉంటే కనుక కొంత ఊపు వస్తుందని అంటున్నారు. మరి వైసీపీ హైకమాండ్ ఈ విషయంలో ఏమి ఆలోచిస్తుందో చూడాల్సి ఉంది అని అంటున్నారు.

## ఏపీకి రండి.. సన్‌రైజర్స్ జట్టుకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆఫర్

మొదటి పేజి తరువాయి

ఈ నేపథ్యంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఓ ఆఫర్ ఇచ్చింది. హెచ్‌సీఏతో నెలకొన్న వివాదం నేపథ్యంలో తమ రాష్ట్రానికి రావాలని ఆహ్వానించింది. ఈ సీజన్‌లోని మిగతా మ్యాచ్‌లను వైజాగ్ వేదికగా నిర్వహించాలని కోరింది. పన్ను మినహాయింపులు కూడా ఇస్తామని, అద్దె కూడా తీసుకోబోమని, ఇతర సహకారాలు కూడా అందిస్తామని తెలిపింది. సన్‌రైజర్స్ జట్టు నుంచి సమాధానం కోసం ఎదురుచూస్తున్నామని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ వెల్లడించింది. అదనపు కాంప్లిమెంటరీ పాసుల కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) తమను బెదిరిస్తున్నదని, ఈ విషయంలో బీసీసీఐ తక్షణమే జోక్యం చేసుకోకుంటే తాము హైదరాబాద్‌ను వదిలివెళ్తామని సన్‌రైజర్స్ విడుదల చేసిన ఈ-మెయిల్ తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ విషయంపై హెచ్‌సీఏ కూడా స్పందించింది. అసలు తమకు ఎస్ఆర్‌హెచ్ నుంచి ఎలాంటి ఈ-మెయిల్ రాలేదని ఓ ప్రకటన విడుదల చేసింది. కార్పొరేట్ బాక్సుల టికెట్ల విషయంలో మొదలైన రగడపై అటు ఎస్ఆర్‌హెచ్, ఇటు హెచ్‌సీఏ ఢీ అంటే ఢీ అనుకుంటున్నాయి. ఒప్పందం ప్రకారం ఉప్పల్ స్టేడియంలోని మొత్తం సీటింగ్ కెపాసిటీలో 10 శాతం (3,900 సీట్లు) హెచ్‌సీఏకు సన్‌రైజర్స్ ఇవ్వాల్సి ఉంది. ఇక తాజా వివాదం నేపథ్యంలో హెచ్‌సీఏ కార్యదర్శి ఆర్. దేవ్‌రాజ్ సమక్షంలో ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఎస్ఆర్‌హెచ్ ప్రతినిధులు కిరణ్, శరవణన్, రోహిత్ పాల్గొని చర్చలు జరిపారు. చర్చల సందర్భంగా.. బీసీసీఐ, ఎస్ఆర్‌హెచ్, హెచ్‌సీఏ ట్రైపార్టీ ఒప్పందాన్ని కచ్చితంగా పాటించాలని, ఆ మేరకు స్టేడియం సామర్థ్యంలోని అన్ని విభాగాల్లో 10 శాతం కాంప్లిమెంటరీ పాసులను కేటాయించాలని హెచ్‌సీఏ ప్రతిపాదించగా దానికి ఎస్ఆర్‌హెచ్ అంగీకారం తెలిపింది. ఉప్పల్‌లో జరుగబోయే ఐపీఎల్ మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించేందుకు పూర్తిగా సహకరిస్తామని హెచ్‌సీఏ హామీ ఇచ్చింది. చర్చల అనంతరం వివాదం ముగిసిందని ఇరు వర్గాలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. అయితే, ఇప్పుడు ఎస్ఆర్‌హెచ్‌కు ఏసీఏ నుంచి ఆఫర్ రావడం గమనార్హం.

## చైనాకు అమెరికా సుంకాల దెబ్బ...

మొదటి పేజి తరువాయి



ముఖ్యంగా సాంకేతిక ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్, రత్నాలు, ఆభరణాలు, వస్త్రాలు వంటి రంగాల్లో భారత్ దూసుకుపోయే అవకాశం ఉంది. ఈ విషయంపై ఈవై ఇండియా ట్రేడ్ పాలసీ లీడర్ అగ్నేశ్వర్ సేన్ మాట్లాడుతూ, ఇతర ప్రాంతీయ ఎగుమతిదారులపై తీవ్ర ప్రభావం చూపే రంగాలలో భారతదేశానికి పోటీతత్వం పెరిగే అవకాశం ఉంది అన్నారు. అంతేకాకుండా, ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి సప్లై చెయిన్ వ్యవస్థలను పునర్నిర్మించాలని, ఆసియాలోని ఎఫ్ టీఏ భాగస్వాములతో సహకరించాలని సూచించారు. గత ఆర్థిక సంవత్సరంలో భారత్ 10 బిలియన్ డాలర్ల విలువైన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేసింది. రాబోయే సంవత్సరాల్లో పాలసీ మద్దతు, అనుకూల పన్ను విధానం ఉంటే ఈ సంఖ్య 100 బిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని ఐసీఈఏ అంచనా వేసింది. భారత్, అమెరికా మధ్య సమగ్ర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదిరితే, భారత ఎలక్ట్రానిక్స్ వాణిజ్యం మరింత వృద్ధి చెందుతుందని ఐసీఈఏ ఛైర్మన్ పంకజ్ మోహింద్రూ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా తక్కువ ధర కలిగిన కార్ల విభాగంలో భారతదేశ ఎలక్ట్రిక్ వాహన రంగం అమెరికా మార్కెట్‌లో ఎక్కువ వాటాను పొందే అవకాశం ఉందని ఈవై ఇండియా పార్టనర్ సౌరభ్ అగర్వాల్ అన్నారు. 2023లో చైనా ఆటో మొబైల్, విడిభాగాల ఎగుమతులు 17.99 బిలియన్ డాలర్లుగా ఉండగా, భారత్ ఎగుమతులు 2.1 బిలియన్ డాలర్లు మాత్రమే. ఈ వ్యత్యాసాన్ని అధిగమించడానికి ప్రభుత్వం పీఎల్ఐ పథకాన్ని మరింత మెరుగుపరచాలని నిపుణులు సూచిస్తున్నారు. అమెరికా సుంకాల నేపథ్యంలో చైనాకు ఎదురుదెబ్బ తగలడం, భారత్‌కు కలిసిరావడం అనేది ఆర్థికంగా ఒక ముఖ్య పరిణామం అని... దీనిని సద్వినియోగం చేసుకుంటే, భారతీయ ఎగుమతులు కొత్త శిఖరాలను అధిరోహించగలవని నిపుణులు పేర్కొన్నారు.

## డోనాల్డ్ ట్రంప్ సుంకాలపై పీఎంఓ ఉన్నత స్థాయి సమావేశం



ఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన సుంకాల ప్రకటనను అంచనా వేయడానికి ప్రధానమంత్రి కార్యాలయం ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి ప్రధానమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి అధ్యక్షత వహిస్తున్నారు. వాణిజ్య మంత్రిత్వ శాఖ, నీతి ఆయోగ్, డీఐఐటీ ఇంకా ఇతర విభాగాల సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొని, సుంకాల ప్రభావాలను పిఎంఓకు వివరించారు. ఈ సమావేశం ద్వారా ప్రభుత్వం ట్రంప్ సుంకాలపై ఉన్నతస్థాయిలో అంచనాలను తీసుకోవాలని ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా.. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ట్రంప్ సుంకాలపై స్పందిస్తూ, ఈ నిర్ణయాన్ని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. భారతదేశం వాణిజ్య సంబంధిత సమస్యలను పరిష్కరిస్తే, అమెరికా ఈ సుంకాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. ట్రంప్ సుంకాలకు సంబంధించి వాణిజ్య మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి ఒకరు మాట్లాడుతూ.. ఈ నిర్ణయం షాక్ కలిగించదని, మిశ్రమ ఫలితంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ పరిస్థితిని జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే, అమెరికా సుంకాలను తగ్గించే దిశగా సరైన ప్రతిస్పందనలను పరిశీలిస్తున్నామని ఆయన తెలిపారు. ఇకపోతే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు రకాల సుంకాలను విధించారు. మొదటి సుంకం ఏప్రిల్ 5 నుంచి అమల్లోకి రాబోతుంది. ఈ సుంకం అన్ని దేశాలతో పోల్చితే 10 శాతం బేస్ టారిఫ్‌గా అమలు చేయబడుతుంది. గతంలో ఈ సుంకం 2.5 శాతంగా ఉండేది. ఈ నిర్ణయం ద్వారా అమెరికా అన్ని దేశాలకు బేస్ టారిఫ్‌ను పెంచింది. ఇక రెండో విషయానికి వస్తే., ప్రతి దేశంపై వేర్వేరు సుంకాలను విధించడం ప్రారంభించనుంది. అంటే ఒక దేశం అమెరికాపై 40 శాతం సుంకం విధిస్తే, అమెరికా ఆ దేశంపై 20 శాతం సుంకం విధించినట్లుగా సమాచారం. ఈ సుంకాలు ఏప్రిల్ 9 నుంచి అమల్లోకి రాబోతున్నాయి. అమెరికా భారతదేశంపై 26 శాతం సుంకం విధించబోతున్నట్లు సమాచారం. ఈ కొత్త సుంకాల ప్రభావం భారత్-అమెరికా వాణిజ్య సంబంధాలపై గణనీయమైన ప్రభావం చూపించవచ్చు. అమెరికా సుంకాలను పెంచడం భారతదేశానికి కూడా కొన్ని సవాళ్లను తీసుకురావచ్చు, కానీ ఈ సుంకాలను తగ్గించడానికి రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలపడాల్సిన అవసరం ఉంది. భారతదేశం ఈ పరిణామాలను సమీక్షించి, అవసరమైన చర్యలను తీసుకుంటుందని భావిస్తున్నారు.

## ఆటో స్టార్టర్లు తొలగించుకొని నీరు, విద్యుత్ వృథా అరికట్టండి

### విద్యుత్ ఏ డి ఈ మనోహర్



మెట్‌పల్లి, ( జనం రిపోర్టర్ ): వేసవి ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతున్న దృష్ట్యా, భూగర్భ జలమట్టాలు శీఘ్రంగా పడిపోతున్నాయని, విద్యుత్ వాడకం అనూహ్యంగా పెరుగుతున్నదని కావున రైతులు నీటిని పంటలకు అవసరం ఉన్నంత మేరకే వాడుకోవాలని, ఆటో స్టార్టర్లతో వృథా చేయరాదని మెట్ పల్లి ఏడీఈ మనోహర్ ఒక ప్రకటనలో రైతులకు విజ్ఞప్తి చేశారు. మరో రెండు వారాల్లో వరి పంట కోతదశకు చేరుకోనుందని ఎవరైనా రైతులు ఆటో స్టార్టర్లను వినియోగించి అవసరానికి మించి నీటిని తోడడం వలన నీరు వృథాగా కాలువల్లో, వాగుల్లో పడిపోవడం వల్ల అనవసరంగా నీటితో పాటు విద్యుత్ కూడా వృథా అవుతుందని దానివల్ల భూగర్భ జలమట్టాలు కూడా అడుగంటి పోయే అవకాశం ఉందని తెలిపారు. ఈ ప్రక్రియతో అవసరం ఉన్న రైతులకు నీరు అందకుండా పోతుందని, వారి పంటల పట్ల కూడా సామాజిక బాధ్యత వహించాలని రైతులకు మనవి చేశారు. ఏ ఒక్కరూ కూడా ఆటో స్టార్టర్ వినియోగించవద్దని విజ్ఞప్తి చేశారు. మెట్‌పల్లి మరియు మల్లాపూర్ సబ్ డివిజన్ పరిధిలో సుమారు 32 వేల వ్యవసాయ విద్యుత్ పంపుసెట్లు నడుస్తున్నాయని వాటికి నిరంతర ఉచిత విద్యుత్తు ప్రతిరోజు 11.22 లక్షల యూనిట్లు సరఫరా జరుగుతుందని తెలిపారు. 28 సబ్ స్టేషన్ లు, 122 11కెవి ఫీడర్లు, 5 వేల డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్ ల ద్వారా నాణ్యమైన విద్యుత్ అందించుట కొరకు సిబ్బంది ఎల్లవేళలా వినియోగదారులకు అందుబాటులో ఉండి కృషి చేస్తున్నారని, ఏదైనా సరఫరాలో లోపం తలెత్తితే 1912 కు కాల్ చేయాలని సూచించారు. రైతు సోదరులు పంటలు పూర్తిస్థాయిలో చేతికి అందేంతవరకు అప్రమత్తంగా ఉండాలని నీటిని, విద్యుత్ ను వృథా చేయకుండా పొదుపుగా వాడుకొని సహకరించాలని, భవిష్యత్ తరాలకు ప్రకృతి వనరులు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## నీటి సమస్యను పరిష్కారం చేసిన...టీడీపీ నాయకులు



మడకశిర జనం రిపోర్టర్: మడకసిరా పట్టణంలో కొత్త హరిజన వీధిలో నీటి సమస్యను తెలుగుదేశం పార్టీ నాయకులు పరిష్కరించారు. ఇందులో భాగంగా కాలనీలోని నీటి పైపులు మరమ్మతులు చేసినారు. చాలా కాలం నుండి పైపులు విరిగిపోయినాయి మరియు తాగునీటి ఎద్దడి చాలా ఎక్కువగా కాలనీలో ఉన్నది. ప్రతి ఒక్కరికి నీటి సమస్య లేకుండా పరిష్కరించాలని కాలనీ టిడిపి నాయకులు ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ రమేష్, ఐటీడీపీ శ్రీకాంత్, డీలర్ రాజు సోదరుడు ప్రకాష్, ఐ టి డి పి రవి, మురళి బాబు ,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముస్లింలపై కుట్రలో భాగమే వక్ఫ్ సవరణ బిల్లు, :




రేపల్లె. ( జనం రిపోర్టర్ ) : రేపల్లె నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ గణేష్ ఆధ్వర్యంలో పట్టణంలో జరిగిన పత్రికా సమావేశంలో పాల్గొన్న వైసీపీ మైనార్టీ విభాగం బాపట్ల జిల్లా అధ్యక్షురాలు నాసిరుని సా బేగ్ తన చాంబర్లో గురువారం ఆమె మాట్లాడుతూ నిన్నటి దినం భారతదేశానికి చీకటి రోజు అని బ్లాక్ డేగా అభివర్ణించారు ,బిజెపి గద్దెనెక్కినప్పటి నుండి ఇప్పటివరకు ముస్లింలపై కక్షపూరితమైనటువంటి నల్ల చట్టాలను ప్రవేశపెట్టి ముస్లింల మనోభావాలను దెబ్బతీస్తున్నదని అమే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు అతి పెద్ద కుట్రకు తెర లేపిందని అందులో భాగమే వక్ఫ్ సవరణ చట్టం ఇది కేవలం సవరణ మాత్రమే కాదని యావత్ భారతదేశం లో ఉన్నటువంటి వక్ఫ్ ఆస్తులను వారి సానుభూతిపరులకు దారదత్తం చేయడం కోసం ఒక కుట్ర అని దుయ్య బ టే రు రాజ్యాంగం లోని ఆర్టికల్ 14 ఆర్టికల్ 25, 26 ను %అఅ%అపహస్యం చేస్తూ మతపరమైనటువంటి బిల్లులను ప్రవేశపెట్టి ఇతర మతాచారాలలో వేరొకరి ప్రమేయాన్ని ప్రవేశపెట్టి మా ఆస్తులను దోచుకునే ప్రయత్నం మాత్రమే ఈ సవరణ చట్టమని అన్నారు .ఇది ఇంతటితో ఆగదు ఇక రాబోయే రోజుల్లో ముస్లింల ఓటు హక్కు కూడా తీసివేసే ప్రయత్నం జరుగుతుందని భారత జట్టు దేశం నుండి ముస్లింలను తరిమివేసే అతిపెద్ద కుట్రలో భాగమే ఈ వక్ఫ్ సవరణ చట్టం అని ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశము అన్ని మతాల సంస్కృతుల సమ్మేళనమని మరి అలాంటి సంస్కృతిని విచ్ఛిన్నం చేయడం కోసమే ఇలాంటి మత విద్వేషకరమైనటువంటి చట్టాలను ప్రవేశపెట్టి అన్నదమ్ముల్లా కలిసి ఉండేటటువంటి వారి మధ్య శత్రుత్వం పెంచుతుందని ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ఈ వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగం పై దాడిగా పేర్కొన్నా రూ , ఇక రాబోయే రోజుల్లో మా బిడ్డలకు బడులు ఉండవు మాకు మసీదులు ఉండవు దర్గాలు ఉండవు చచ్చిపోతే పాతి పెట్టడానికి స్మశానాలు కూడా ఉండవని ఆవేదన వ్యక్తం చేశారు .ఇప్పటికైనా ప్రజలు గ్రహించి ఈ ఎన్డిఏ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు .లేకపోతే మిమ్మల్ని సమాజం క్షమించదని అన్నారు ఈ వక్ఫ్ నల్ల చట్టాన్ని వెనక్కి తీసుకోకపోతే ప్రజా ఆగ్రహాన్ని రుచి చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లియాకత్ భాష అబ్దుల్ కుద్దూస్, గౌస్, ఖాదర్ రఫీ, బాజీ, వైఎస్ఆర్సీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ జిల్లా:
## వికారాబాద్ కలెక్టర్ కార్యాలయం లో

### భూస్వాములు, దొరల అరాచకాల నుంచి ప్రజలను విముక్తి చేసేందుకు విరోచితమైన పోరాటం చేసిన వీరుడు దొడ్డి కొమురయ్య అని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిది ( జనం రిపోర్టర్ ) : వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోగురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దొడ్డి కొమరయ్య జయంతిని వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ముందుగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుధీర్, డిబిసిడిఓ ఉపేందర్, డీఎస్సీడిఓ మల్లేశం, డిటిడబ్ల్యుఓ కమలాకర్ రెడ్డి లతో కలిసి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లింగ్యా నాయక్ జ్యోతి ప్రజ్వలన గావించి దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ మాట్లాడుతూ... దొడ్డి కొమరయ్య సాధారణ గొర్రెల పెంపకం దారుల కుటుంబంలో జన్మించినప్పటికీ దొరల, భూస్వాముల అరాచకాలను తట్టుకోలేక యువతి, యువకులను ఏకం చేసి వారి ఆగడాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. వెట్టిచాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టుకొని విసునూరు దొరల ఆగడాలను అరికట్టించడంలో ముందు వరసలో ఉండి పోరాటం చేసిన వీరుడు దొడ్డి కొమరయ్య అని తెలిపారు. విసునూరు దేశ్ముఖ్ లు మనుషులను వెట్టి చాకిరీ చేయించడంలో, వడ్డీలు వసూలు చేయడంలో రకరకాల శిక్షలు, జరిమానాలు విధించి ప్రజలను ఎంతో ఇబ్బంది పెట్టే వారని వీటికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరచి నిర్మూలించగలిగిన మహా వ్యక్తి దొడ్డి కొమరయ్య అని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో దొరలు, భూస్వాముల తుపాకీ తూటాలకు బలి అయిన తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ ఫరీనా ఖాతున్, ఏబిసిడిఓ భీమ్ రాజ్, ఏఎస్ డబ్ల్యూఓ శుక్ర వర్ధన్ రెడ్డి, వసతి గృహాల సంక్షేమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## మహనీయుల జయంతి ఉత్సవాలకు ఏర్పాటు చేయించండి,
## మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు వినతి పత్రం అందజేత.....



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 03. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం చేపడుతున్న మహనీయుల జయంతోత్సవాలను విజయవంతం చేయవలసిందిగా, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ లోని గోదావరిఖని పట్టణంలో ఏప్రిల్ 5న. దివంగత భారత మాజీ ఉప ప్రధాని, జగ్జీవన్ రామ్ జయంతి, ఏప్రిల్ 11న. మహాత్మ జ్యోతిబాపూలే జయంతి, ఏప్రిల్ 14న. బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో ఘనంగా నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ మేరకు మూడు విగ్రహాల వద్ద రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని, కార్యక్రమాల నిర్వహణ కోసం గురువారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, బొంకూరి మధు, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్, జిల్లా కో,కన్వీనర్ ఆకునూరి బాల అంకుస్, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల సమ్మయ్య, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ ఎక్కిరాల రమేష్, సింగరేణి ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, ఏ ఎల్ పి పిట్ సెక్రటరీ మహంకాళి శంకర్, దయాల్ శర్మ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## పల్లాలమ్మ చెరువుపై...... అధికారుల నిర్లక్ష్యం...???
## చేపల కోసం బయటకు తోడేస్తున్న నీరు పట్టించుకోని అధికారులు.....

పెదకాకాని ( జనం రిపోర్టర్ ): భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో పల్లాలమ్మ చెరువులోని నీటిని అక్రమంగా బయటకు తరలించడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు పెదకాకాని మండల తహసీల్దార్ గారిని, మండల ప్రజాపరిషత్ డెవలప్మెంట్ కార్యాలయంలో, పెదకాకాని పంచాయతీ కార్యదర్శి గార్లకు వినతిపత్రం సమర్పించడం జరిగినది. గ్రామపంచాయతీ కార్యదర్శి గారికి ఈ విషయం గురించి తెలియపరచగా, మా నుంచి నీటిని వెళ్ళగట్టుటకు ఎలాంటి అనుమతి లేదని, దానిపై చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ సందర్భంగా పొన్నూరు





నియోజకవర్గ సిపిఐ పార్టీ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ బుజ్జి మాట్లాడుతూ పెదకాకాని పల్లాలమ్మ చెరువులోని నీళ్లను పెద్ద పెద్ద మోటార్ల ద్వారా బయటకు పంపుటను నిలుపుదల చేయుట గురించి, అధికారులను వివరణ కోరగా, మా కార్యాలయాల నుండి చెరువులోని నీరు బయట పెట్టుటకు అనుమతి ఎవరికి ఇవ్వలేదని తెలియజేయడం జరిగింది అన్నారు. ఈ సమస్యపై పై అధికారులతో చర్చించి చెరువులోని నీళ్లను బయటకు పంపకుండా నిలువరిస్తామని హామీ ఇచ్చారన్నారు. పల్లాలమ్మ చెరువులోని నీళ్లను చేపల పాటదారుని వివరం కోరగా, మేము అధికారులు వద్ద అనుమతి తీసుకుని, నీటిని బయటికి పంపించడంతోపాటు, చెరువును శుభ్రం చేస్తామని చెబుతూ, మేము అన్ని విధాల ప్రభుత్వ అధికారుల వద్ద అనుమతి తీసుకుని, ఈ చెరువులోని నీరుని బయటకు పంపించి పూడిక తీసి శుభ్రం చేస్తున్నామని బుకాయిస్తున్నారని తెలియజేశారు. ఈ వేసవికాలంలో చెరువులో నీరు లేకపోయినట్లయితే, గ్రామంలోని భూగర్భ జలాలు ఇంకిపోవుట వలన బావులలోను, బోరులలోను గ్రామ అవసరాలకు నీరు చాలక , గ్రామ ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొనవలసి రావడంతో పాటు, పశువులకు, పక్షులకు దాహార్తి తీర్చుకునే అవకాశం ఉండదన్నారు. గతంలో ఒకసారి చెరువులో నీళ్లు లేకపోవుట వలన ప్రజలందరూ అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకోగా, వారు సంబంధిత అధికారులతో మాట్లాడి, గుంటూరు ఛానల్ కాలువ నుండి కొన్ని లక్షల రూపాయలు హెచ్చించి, చెరువు లో నీరు నింపటం జరిగిందన్నారు. కనుక ప్రజాధనమును వృథా చేయకుండా కాపాడటంతో పాటు, ఈ వేసవిని దృష్టిలో పెట్టుకొని, చెరువులోని నీటిని వృధాగా బయటకు పంపించకుండా అడ్డుకొని, ఈ వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి నివారణ చేయవలసినదిగా ప్రభుత్వ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కేతినేని అగస్టీన్, రామిశెట్టి శ్రీనివాసరావు, బొట్టు శ్రీనివాసరావు, రెంటాల మోజేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్కౌంటర్ల పేరిట హత్యలు చేస్తున్న ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలి....

### సి పి ఐ (ఎం ఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు చిలుక శంకర్....



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 03. ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలని ఏప్రిల్ 8న. హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద జరిగే ప్రజా ధర్నా పోస్టర్ ఎన్టిపిసి టౌన్ లోని, ఐఎఫ్టీయు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. అనంతరం సిపిఐ.(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు చిలుక శంకర్ మాట్లాడుతూ..ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసి జాతి హననానికి బిజెపికి చెందిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎడతెగని విధంగా హత్యాకాండ కు తెగబడుతున్నాయని అన్నారు. చత్తీస్ ఘడ్ రాష్ట్రంలో వందలాది మందిని ఎన్కౌంటర్ల పేరిట హత్య గావిస్తున్నారు. ఈ హత్యాకాండను ప్రత్యేకించి ఆదివాసి జాతిని స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం హతమారుస్తున్న విధానాన్ని దేశంలోని రాజకీయ పార్టీలు ప్రజాసంఘాలు, మేధావులు, ఆలోచనపరులు తీవ్రంగా వ్యతిరేకించి ఖండించాలని అన్నారు. సిపిఐ (ఎం ఎల్) న్యూ డెమోక్రసీ ఏప్రిల్ 8న రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరంలో ధర్నా చౌక్, ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా ను తలపెట్టింది. ఈ ధర్నా లో పాల్గొని మధ్య భారతంలోని ఆదివాసీ ప్రజానీకం జల్, జంగిల్, జామీను- ఇజ్జత్ హమారా హై" అంటూ అడవిని, అడవిలోని సహజ సంపదను రక్షించుకునేందుకు సాగిస్తున్న ఆదివాసీల విరోచిత పోరాటం పై, క్రూర మారణకాండను నిరసిద్దామని అన్ని వర్గాల ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నదన్నారు. అడవుల్లో అపారమైన ఖనిజ సంపదను ఖనిజ నిక్షేపాలను వనరులను రక్షించడం ద్వారానే తమ జీవిత మనుగడ ఆధారపడి ఉందని పోరాడుతున్న అడవి బిడ్డలకు కొండంత అండగా నిలబడుదాం అన్నారు ఈ గోడపత్రి ఆవిష్కరణ కార్యక్రమం లో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు బి బుచ్చన్న, పుట్టపాక స్వామి, ఎన్టీపీసీ టౌన్ నాయకులు జి కుమార్, జి రాజయ్య, ఎ రవి, ఆర్ రాయమల్లు, యస్ చందు, డి రమేష్, ప్రభాకర్, డి రవి, యు వసంత్, పి వెంకటస్వామి, ఓ సుధాకర్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో సన్న బియ్యం సంబరాలు

### నల్లబెల్లి మండలంలో సన్న బియ్యం పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభించిన నర్సంపేట మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్




వరంగల్ ( జనం రిపోర్టర్ ) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ పాలాయి శ్రీనివాస్ గారు. నల్లబెల్లి మండలం లోని నారక్కపేట, నాగరాజు పల్లె, ముదు చేక్కలపల్లి, కన్నారావుపేట, రామతీర్థం, నల్లబెల్లి, లెంకల పెల్లి, గ్రామాల్లో ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, ఎంపీడీవో,ఏవో, మండల పార్టీ అధ్యక్షులు తిరుపతిరెడ్డి, జిల్లా కార్యదర్శి మాలోతు రమేష్, మండల ప్రధాన కార్యదర్శి చార్ల శివారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్తారు శేఖర్, మండల ఉపాధ్యక్షులు మాలోతు మోహన్, కార్యదర్శి జెటీ రామ్మూర్తి, మామిళ్ళ కొమురెల్లి, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు ఏడాకుల సంపత్ రెడ్డి ఏడాకుల సంపత్ రెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు భూక్య బౌసింగ్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు ఎండి యాకూబ్, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నల్లగొండ మాజీ ఉపసర్పంచ్ వడ్లూరి రమేష్, మండల నాయకులు చిట్యాల ఉపేందర్ రెడ్డి,కోదూరి రాయసాబ్, డ్యాగల కృష్ణ, అజ్మీర శోభన్, గుండాల రాజ కొమురయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు వేముల సంపత్ రెడ్డి, చెంచు కుమార్, శ్రీపతి సుమన్, మెరుగు శ్రీనివాస్, వెంగల్ దాస్ రమేష్, బైరి వెంకట్, మామిళ్ల పోశాలు,భూక్య బాలాజీ, భూక్య రమేష్, నాయకులు రాజిరెడ్డి, సోమశేఖర్ రెడ్డి, తిరుపతిరావు, కుమారస్వామి, హస్సేన్, శోభన్, గొటుకుల రాజ్ కుమార్, మురారి లింగమూర్తి, కుమారస్వామి, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



## సివిల్ డిపార్ట్మెంట్ లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించండి....

### ఎస్.ఇ సివిల్ కు వినతి పత్రం ఇచ్చిన ఏఐటియుసి నాయకులు.....

రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 03. సింగరేణి ఆర్జీ వన్ సివిల్ డిపార్ట్మెంట్ లో పనిచేస్తున్న కార్మికులు తమ సమస్యలు పరిష్కారం కాక అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, ఎస్.ఇ సివిల్ వరప్రసాద్ కు సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి సివిల్ డిపార్ట్మెంట్ నాయకులు గురువారం సమస్యల తో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వినతి పత్రం లో సమస్యల పై ఎస్.ఇ వరప్రసాద్ కు వివరించి పరిష్కరించాలని కోరడం జరిగిందని, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ సివిల్ డిపార్ట్మెంట్ కార్యదర్శి దాసరి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ డిపార్ట్మెంట్ లో ముఖ్యంగా సెక్టార్ వన్ లో పని చేస్తున్న కార్మికులకు మస్టర్ వేయడానికి, స్టోర్ మెటీరియల్ ఇవ్వడానికి క్లర్కు లేనందున, అక్కడ ఒక క్లర్క్ ను కేటాయించాలని కోరడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా సెక్టార్ వన్, సెక్టార్ టు పరిధిలోని అన్ని వాటర్ ట్యాంకులను క్లీనింగ్ చేయించాలని, ట్యాంకుల యొక్క నీటి సామర్థ్యం, క్లీనింగ్ చేసిన తేదీని వ్రాయించగలరని చెప్పడం జరిగిందని ఆయన అన్నారు.అన్ని ట్యాంకుల వద్ద కరెంటు సౌకర్యం కల్పించాలని, ట్యాంక్ ల ఆవరణలో పిచ్చి చెట్లను తొలగించి క్లీనింగ్ చేయించాలని, జిడికె 5 ఇంక్లైన్





నుండి వర్క్ షాప్ కు వెళ్లే దారిలో యాక్సిడెంట్లు చాలా అవుతున్నందున, స్పీడ్ బ్రేకర్లు వేయించే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడి వేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందని ఆయన అన్నారు. సెక్టార్ వన్ లోని ఇంటెక్ వెల్ పంపు హౌస్ నందు పంపు ఆపరేటర్లను ప్రతి షిఫ్ట్ లో ఇద్దరిని కచ్చితంగా కేటాయించాలని అడగడం జరిగిందని వాల్వు ఆపరేటర్లకు స్పానర్స్, పిట్టర్లకు టూల్స్ ఇవ్వాలని , కార్మికులకు యూనిఫామ్, షూస్ ( ఓపెన్ కాస్ట్ షూస్) ఇవ్వాలని కోరడం జరిగిందని ఆయన అన్నారు. సెక్టార్ టు ఫిల్టర్ బెడ్ నందు వాటర్ లెవెల్ మీటర్ ఏర్పాటు చేయాలని, ఏరియా హాస్పిటల్ యందు పంపు షెడ్ మరియు వాటర్ ట్యాంక్ రిపేర్ చేయించాలని, ఆర్.సి.ఓ.ఎ క్లబ్ ట్యాంకు మరియు డిగ్రీ కళాశాల వద్ద ఉన్న ట్యాంకు మెయిన్ వాల్స్ లీకేజీ అవుతున్నందున, ట్యాంకు ఓవర్ ఫ్లో అవుతుందని, మెయిన్ వాల్స్ మార్చాలని తదితర సమస్యల ను పరిష్కరించాలని సివిల్ డిపార్ట్మెంట్ అధికారులను జరిగిన సమావేశంలో కోరడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు బిట్టి వెంకటేశ్వర్లు, అటికేటి రాజు, సివిల్ డిపార్ట్మెంట్ వర్క్ మెన్ కమిటీ సభ్యులు బి.ఆర్.కె.రెడ్డి, బొల్లి శ్రీనివాస్, తోట మల్లేష్, ప్రేమ లత, తదితరులు పాల్గొన్నారు.

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక



## : రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఘనంగా సామూహిక హెూమాలు....






రామగుండం ( జనం రిపోర్టర్ ): రామగుండం:ఏప్రిల్ 03. గోదావరిఖని మార్కండేయ కాలనీలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ దేవాలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రెండవ రోజు గురవారం రేణుక ఎల్లమ్మ,జమదగ్ని మహర్షి ,ఉత్సవ విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమంలో బాగంగా సామూహిక హెూమాలను ఆలయ ప్రతిష్టాపనా చార్యులు దుద్దిల్ల మనోహర అవధాని, వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని గౌడులు పెద్ద ఎత్తున హాజరై పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు.కార్యక్రమ అనంతరం అన్నదానం నిర్వహించారు.ఆలయ ఉత్సవ కమిటి ఆద్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు నిర్వహించారు. నేడు రేణుకామాత పరివార దేవత మూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన విజయవంతం చేయండి..రేణుకాఎల్లమ్మ దేవాలయకమిటీ ఆద్వర్యంలో నేడు రేణుకామాత,జమదగ్ని మహర్షి, పరివార దేవతల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి గౌడ కులబాంధవులు రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ ఉత్సవ కమిటి నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలోమెరుగు హనుమంతు గౌడ్, బాలసాని స్వామి గౌడ్,వంగ శ్రీనివాసు గౌడ్, బాలసాని, కొమురయ్య గౌడ్,కోట రవి గౌడ్, గడ్డం రవి గౌడ్ మోడెం సురేందర్ గౌడ్, బెందే నాగభూషణం గౌడ్ నేరెళ్ల భీమయ్య గౌడ్ ,పొన్నం అంజయ్య గౌడ్, పైడిపల్లి రామ్మూర్తి,పొన్నం విజయ్ కుమార్ గౌడ్, పొన్నం విద్య లక్మన్ గౌడ్,బండి రమేష్ మూల అశోక్ గౌడ్ మచిడి రాజుగౌడ్, ఐర్నేని యాదగిరి గౌడ్ , నాగుల రమేష్ , గుర్రం గోపి , మండ రమేష్ గౌడ్, మాచిడి .మహేందర్ గౌడ్, గున్నాల. శ్రీదర్ గౌడ్ పాల్గొన్నారు.

## ఎన్టీపీసీ అనుమతిలేకుండా ఆరు ప్రాంతాల్లో చేపట్టిన నిర్మాణాలపై 99 కోట్ల 28 లక్షల రూపాయల భారీ పెనాల్టీ....

### పెనాల్టీ పై కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ....



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:ఏప్రిల్ 03. రామగుండం కార్పొరేషన్ పరిధిలో ఎన్టీపీసీ అనుమతిలేకుండా ఆరు ప్రాంతాల్లో చేపట్టిన నిర్మాణాలపై 99 కోట్ల 28 లక్షల రూపాయల భారీ పెనాల్టీ విధించడాన్ని, కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ.రామగుండం మున్సిపల్ నిబంధనలను


VAMSI KRISHNA GADDAM
MEMBER OF PARLIAMENT
LOK SABHA
RECEIVED
03 APR 2025
Yours sincerely,
Vamsi Krishna Gaddam
MP, Peddapalli constituency
33, Ferozeshah Road, New Delhi - 110001

ఉల్లంఘించడం గమనార్హం అని స్పష్టం చేశారు. స్థానిక నిబంధనలను గౌరవించకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్టీపీసీ అభివృద్ధి చట్టబద్ధమైన విధానాలను, స్థానిక నిబంధనలను పాటిస్తేనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమ నిర్మాణాలు మళ్లీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్టీపీసీ యాజమాన్యానికి సూచనలు ఈ అంశాన్ని అత్యంత బాధ్యతాయుతంగా తీసుకుని, తగిన పరిష్కార చర్యలు తీసుకోవాలి. రామగుండం అభివృద్ధికి ఎన్టీపీసీ సంస్థ పూర్తి సహకారం అందించాలి. కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఈ అంశంపై తగిన చర్యలు తీసుకుని, ఎన్టీపీసీ సంస్థకు అవసరమైన మార్గదర్శకాలను జారీ చేయాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ విజ్ఞప్తి చేశారు.

## హసన్ పర్తి గ్రామ అభివృద్ధి కమిటీ ఎన్నిక అధ్యక్షులుగా పిట్టల కుమారస్వామి




హసన్ పర్తి మండలం ( జనం రిపోర్టర్ ) : హనుమకొండ జిల్లా హసన్ పర్తి గ్రామ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హసన్ పర్తి జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్లో హసన్ పర్తి పౌర సమాజం జేఏసీ చైర్మన్ అనుమాండ్ల విద్యాసాగర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో హసన్ పర్తి నూతన గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులుగా పిట్టల కుమారస్వామి,కన్వీనర్ గా పెద్దమ్మ శ్రీనివాస్ ,ప్రధాన కార్యదర్శిగా జన్ను కిషన్ గౌరవ అధ్యక్షులు గా గురుమూర్తి శివకుమార్ గౌరవ సలహాదారు అనుమాండ్ల విద్యాసాగర్ కో కన్వీనర్ 1దీకొండ బిక్షపతి 2 ఎస్టి రమేష్ ఉపాధ్యక్షులు





1దాడి రాజు యాదవ్ 2నల్ల కిరణ్ 3పెద్దమ్మ క్రాంతికుమార్ ముదిరాజ్ 4మానుపాటి రమేష్ 5 గోవ్ రాజు కుమారస్వామి 6పోతరాజు మధుకర్ కోశాధికారిగా జనగాని ప్రశాంత్ గౌడ్, ఉపకోశాధికారి మేకల హరిశంకర్, కార్యదర్శి 1వేల్పుల సాయికుమార్, 2శీలం వంశీ,సంయుక్త కార్యదర్శి 1పెద్దమ్మ ప్రశాంత్, 2వెలిగేటి తిరుపతిరెడ్డి, మీడియా ఇంచార్జ్ దాడి చిరంజీవి యాదవ్, కార్యవర్గ సభ్యులు మట్టెడ సుమన్, మర్రి శ్రీనివాస్, కర్ణ కంతి రాకేష్ చారి, బొల్లు యుగేందర్, ఉప్పుల సురేందర్, సట్కూరి సంతోష్ రాజ్, గంట నగేష్ కన్నయ్య, ఓదెల కనకయ్య, ఎస్టి రాజు ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పిట్టల కుమారస్వామి మాట్లాడుతూ.పట్టణ సమస్యలను పరిష్కరించుకోవడానికి,ప్రజా ప్రతినిధుల, ప్రభుత్వం, అధికారుల దృష్టికి ప్రజల సమస్యలను తీసుకు వెళ్లడానికిరాజకీయాలకతీతంగా అభివృద్ధి కమిటీ పనిచేస్తుందన్నారు.గ్రామాన్ని అభివృద్ధి దశలో తీసుకవెళ్లేందుకు తమ వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఇందుకు గ్రామస్తులు కూడా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాటేటి భాస్కర్ చేనేత పారిశ్రామిక సంఘం అధ్యక్షులు హసన్ పర్తి, హసన్పర్తి గ్రామ పురోహితులు గురుమూర్తి గురుదత్తు, బిఆర్ఎస్ యూత్ నాయకులు జిర్ర అనిల్ కుమార్, దాసరి నగేష్ , విద్యార్థి జేఏసీ అధ్యక్షులు చెన్నూరి శ్రీకాంత్, బిఆర్ఎస్ నాయకులు తెలంగాణ ఉద్యమకారుడు ఇమ్మడి రాజేందర్, ఆర్టీసీ కార్మిక సంఘం నాయకులు మేకల యుగేందర్ మొదలగువారు పాల్గొన్నారు.

## ఘనంగా చత్రపతి శివాజీ మహారాజ్ 345 వ వర్ధంతి



అమరచింత వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : అమరచింత పట్టణంలోని శివాజీ నగర్ లో గురువారం చత్రపతి శివాజీ మహారాజ్ 345వ వర్ధంతి కార్యక్రమాన్ని చత్రపతి శివాజీ విగ్రహ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక శివాజీ నగర్ నందు శివాజీ చిత్రపటానికి కమిటీ అధ్యక్షులు మేస్త్రి సురేష్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ చత్రపతి శివాజీ ఒక సెక్యులర్ గా తన రాజ్యాన్ని పరిపాలించిన ధీరుడు అని కొనియాడారు ఈ కార్యక్రమంలో.శివాజీ విగ్రహ కమిటీ ప్రధాన కార్యదర్శి చెన్నం శెట్టి దామోదర్ తెలుగు తిరుమలేష్ వినోద్ కార్యవర్గ సభ్యులు కూతురు రాము రేవల్లి నాగేష్ సలహాదారుసభ్యులు హర్ష శ్రీనివాసులు కమిటి ఇన్చార్జి వినోద్ కుమార్ అదే విధంగా హమాలి యూనియన్ నాయకులు రిక్షా రవి అదేవిధంగా చత్రపతి శివాజీ నగర్ యువకులు రేవుల మురళి ,వగ్గు రవి,లోకేష్ ,నిఖిల్ ,నవదీప్, భరత్, మణికంఠ, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్స్ వర్సిటీలో ఘనంగా ప్రారంభమైన నేషనల్ కాన్ఫరెన్స్ కమ్ వర్క్‌షాప్.







పొన్నూరు ఏప్రిల్ 3. జనం రిపోర్టర్:ఏఐ మరియు నెట్‌వర్క్ బయోలజీ ప్రెసిషన్ థెరపీలు వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఎన్ఐటీ వరంగల్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ ఆసిం బికాస్ దాస్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగంలోని బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మేటిక్స్, స్కూల్ ఆఫ్ కంప్యూటింగ్ అండ్ ఇన్ఫర్మేటిక్స్ విభాగంలోని సీఎస్ఈ, ఏసీఎస్ఈల సంయుక్త ఆధ్వర్యంలో " రీసెంట్ కంప్యూటింగ్ ట్రెండ్స్ ఫర్ బయోఇన్ఫర్మేటిక్స్ అండ్ బయోటెక్నాలజీ" అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న నేషనల్ కాన్ఫరెన్స్ కమ్ వర్క్‌షాప్‌ను గురువారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన నిర్వహించి కాన్ఫరెన్స్‌కు సంబందించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఐటీ వరంగల్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ ఆసిం బికాస్ దాస్ మాట్లాడుతూ క్యాన్సర్ అనేది ప్రపంచవ్యాప్తంగా పెద్ద సవాలుగా మిగిలిపోయిన ఒక ముఖ్యమైన ఆరోగ్య సమస్య అని, ఈ రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మరియు నెట్‌వర్క్ బయోలజీ వంటి ఆధునిక సాంకేతికతలు క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పులను తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ రెండూ సమగ్ర, వ్యక్తిగతీకరించిన (పర్సనలైజ్డ్) ప్రెసిషన్ థెరపీ రూపంలో క్యాన్సర్ చికిత్సను మరింత సమర్థవంతంగా మార్చుతున్నాయని పేర్కొన్నారు. ఏఐ సాంకేతికతలు, ముఖ్యంగా డీప్ లెర్నింగ్ మరియు మెషీన్ లెర్నింగ్ విధానాలు క్యాన్సర్ నిర్ధారణలో మరింత ఖచ్చితత్వాన్ని అందించడం, అలాగే మరింత వేగంగా చికిత్సా ప్రణాళికలను తయారుచేయడంలో సహాయపడుతున్నాయని వెల్లడించారు. ఏఐ ఆధారంగా రోగి యొక్క వయస్సు, జన్యు మరియు ఆరోగ్య చరిత్ర ఆధారంగా అప్‌డేటెడ్ చికిత్సా ప్రణాళికలు రూపొందిస్తాయన్నారు. నెట్‌వర్క్ బయోలజీ అనేది జీవశాస్త్రం యొక్క సంబంధిత అంశాలను (జెనెటిక్స్, ప్రోటీవోమిక్స్, మెటాబోలిక్స్) అనుసంధానించి, క్యాన్సర్ వంటి రుగ్మతలను విశ్లేషించడానికి సహాయపడే ఒక శాస్త్రంగా ఎదుగుతోందన్నారు. ఈ టెక్నాలజీలు త్వరలో మరింత అభివృద్ధి చెందుతుండటం వలన, క్యాన్సర్ చికిత్సలో మరింత విజయాలను సాధించడం నిజంగా సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన పుదుచ్చేరిలోని ఐసీఎంఆర్ వెక్టర్ కంట్రోల్ రీసెర్చ్ సెంటర్ సైంటిస్ట్ సీ, డాక్టర్ నంద కుమార్ యెల్లపు మాట్లాడుతూ కంప్యూటేషనల్ వైద్య విజ్ఞానం సమ్మిళితంగా, వ్యక్తిగత వైద్య శాస్త్రాన్ని మరింత అభివృద్ధి చేస్తూ, ప్రతి రోగికి అనుకూలమైన చికిత్సను అందించే దిశగా నడుస్తోందన్నారు. ఈ రంగంలో మరిన్ని పరిశోధనలు, అధునాతన సాంకేతికతల అభివృద్ధి మెరుగైన ఆరోగ్య సంరక్షణకు దారి చూపుతాయని వెల్లడించారు. పెద్దసంఖ్యలో డేటాను మానవ మేధస్సుతో విశ్లేషించడం కష్టసాధ్యమని, కృత్రిమ మేధస్సు (ఏఐ), మెషిన్ లెర్నింగ్, బయోఇన్ఫర్మేటిక్స్ వంటి కంప్యూటేషనల్ టూల్స్ ఉపయోగించి జన్యు వ్యక్తీకరణ నమూనాలను గుర్తించడం, వ్యాధుల మూలకారణాలను అంచనా వేయడం, వ్యాధి నిర్ధారణను మరింత ఖచ్చితంగా చేయడం సాధ్యమవుతోందన్నారు. కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన గుజరాత్‌లోని బేస్‌సాల్వ్ ఇన్ఫర్మేటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఆదిత్య నారాయణ్ సరంగి మాట్లాడుతూ కంప్యూటేషనల్ వర్క్‌ఫ్లో మరింత స్వయంచాలకంగా మారుతూ, వేగవంతమైన మరియు ఖచ్చితమైన వ్యాధి నిర్ధారణను అందించే విధంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ ఆధునిక జీవసాంకేతిక పద్ధతులు భవిష్యత్తులో ఆరోగ్య సంరక్షణ రంగంలో విప్లవాత్మక మార్పులకు దారి తీసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్, కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ప్లాస్టిక్ వస్తువుల పైన అవగాహన సదస్సు







హసన్ పర్తి మండలం( జనం రిపోర్టర్ ): గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 65వ డివిజన్ ఎల్లాపూర్ గ్రామంలో గురువారం ఎస్ ఆర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ప్రత్యేక శిబిరం ఏప్రిల్ 1నుండి7 మూడోరోజుసమ ర్ధవంతంగా కొన సాగింది.ఈ సందర్భంగా ఎన్ ఎస్ ఎస్ కో ఆర్డినేటర్ డా. కె.రవీందర్,వ్యవసాయ డీన్ డా.భూపాలురాజ్ లమార్గదర్శకత్వంలో120మంది ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు గ్రామంలోఇంటిటికివెళ్ళి ప్లాస్టిక్ వ్యర్థాల ప్రమాదాలపై అవగాహన కల్పించారు.ప్లాస్టిక్ మానిపించి పర్యావరణాన్ని పరిరక్షించాల్సి నఅవసరాన్ని గ్రామస్తులకు వివరించాం .అదనంగా జడ్ పి హెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు పుల్ల.సంపత్ స్టాఫ్ సహకారంతో గ్రామంలో వాలంటీర్లు జెడ్ పి హెచ్ఎస్ పాఠశాలగోడలకు పెయింట్ వేసి శుభ్రపరిచారు.ఈ కార్యక్రమాలు గ్రామస్థుల నుండీ మంచి స్పందన పొందాయి.ఎస్ ఆర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం పర్యావరణ పరిరక్షణ సామాజిక సేవలలో తమ కృషిని కొనసాగిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

## నిజాయితీ చాటుకున్న ల్యాండ్రీ షాపు యజమాని ఇస్త్రీకి వచ్చిన ప్యాంట్ జీబు లో 28000

### కస్టమర్ కు ఇచ్చి నిజాయితీ చాటుకున్న చాకలి బాబు



అమరచింత వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ): ఇస్త్రీ చేస్తుండగా ప్యాంటు జేబులో దొరికిన 28 వేల రూపాయలను కస్టమర్ కి ఇచ్చి తన నిజాయితీని చాటుకున్నాడు అమరచింతకు చెందిన లాండ్రీ షాపు యజమాని చాకలి బాబు.అమరచింత పట్టణానికి చెందిన రజక సోదరుడు చాకలి బాబు తన వద్దకు బావండ్ల గోపి అనే వ్యక్తి రెండు పాయింట్లు ఇస్త్రిరికి ఇవ్వగా పాయింట్ జేబులో 28 వేల రూపాయలు ఉన్నట్టు గుర్తించాడు. కస్టమర్ భావండ్ల గోపి మరచిపోయి ఇస్త్రీ చేయడానికి బాబుకు ఇచ్చాడు. ఇది గుర్తించిన చాకలి బాబు ఆ ఫ్యాంటును ఇస్త్రీ చేయడానికి తీసుకోగా అందులో 28 వేల రూపాయలు కనబడ్డాయి వెంటనే బాబు గోపికి సమాచారం ఇచ్చి తిరిగి 28 వేల రూపాయలు ఇచ్చి తన నిజాయితీ చాటుకున్నాడు. జరిగినది ఇది తెలుసుకున్న కాలనీవాసులు రజక సంఘం నాయకుడు సత్యనారాయణ, గోపాల్ నాయక్ తాటికొండ రమేష్, కాలనీవాసులు చాకలి బాబును అభినందించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ వైద్య ఖర్చుల సహాయార్థం



బాపట్ల జిల్లా:-( జనం రిపోర్టర్ ): బాపట్ల నియోజకవర్గం బాపట్ల పట్టణంలోని అర్హులైన 6 మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల సహాయార్థం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్షేమ నిది సీఎం రిలీఫ్ ఫండ్ నుండి వచ్చిన చెక్కులను బాపట్ల పట్టణం లోని ఎమ్మెల్యే నివాసంలో లబ్ధిదారులకు బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు అందజేశారు.

## పెనాల్టీ విధానంలో మార్పులు చేసిన సింగరేణి యాజమాన్యం....

### అన్ని విభాగాలకు వర్తింపచేయాలని విజ్ఞప్తి చేసిన ఏఐటీయూసీ నాయకులు....



రామగుండం( జనం రిపోర్టర్ ): రామగుండం:ఏప్రిల్ 03. సింగరేణిలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానంలో యూనిట్ రేట్ సిస్టం క్రింద సివిల్ విభాగం ద్వారా కాంట్రాక్ట్ కార్మికులు చేస్తున్న పనిలో కార్మికుల హాజర శాతం తక్కువ అయినప్పుడు, కాంట్రాక్టర్లకు పెనాల్టీ విధించే విధానంలో సింగరేణి యాజమాన్యం మార్పులు తీసుకు వచ్చిందని, దీనివల్ల అనేక సంవత్సరాల నుండి ఇబ్బందులు పడుతున్న కాంట్రాక్టర్లు, కాంట్రాక్ట్ కార్మికులకు కొంత ఉపసమనం కలుగుతుందని, సింగరేణి యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల ఏఐటియుసి నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.గురువారం నాడు కొత్తగూడెం సింగరేణి హెడ్ ఆఫీస్ లో డైరెక్టర్ పా కే వెంకటేశ్వర్లు ని చూసి సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ గౌరవాధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ... సింగరేణిలో అనేక సంవత్సరాలుగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విధానంలో పాత పద్ధతులే కొనసాగుతున్నాయని వాటిల్లో మారుతున్న పరిస్థితులకనుగుణంగా కొన్ని మార్పులు తీసుకురావాలని కోరారు. అనేక దపాలుగా సింగరేణి చైర్మన్ కి, ఉన్నతాధికారులకు చేసిన విజ్ఞప్తి మేరకు పెనాల్టీ విధానములో తీసుకువచ్చిన మార్పుల వల్ల కాంట్రాక్టర్లకు తద్వారా కాంట్రాక్ట్ కార్మికులకు కొంత ఉపయోగము ఉంటుందని, దీనివల్ల హాజరు కావలసిన కాంట్రాక్ట్ కార్మికుల్లో 25% వరకు గైరాజరైనప్పటికీ పెనాల్టీ ఉండదని తెలిపారు.కాంట్రాక్ట్ కార్మికుల పైన ఒత్తిడి తగ్గుతుందని అన్నారు.ఈ మార్పులను కేవలం సివిల్ డిపార్ట్మెంట్ లోనే కాకుండా పర్చేజ్ టెండర్స్,ఫారెస్ట్ విభాగం లో కూడా వర్తింప చేయాలని కోరారు. రెగ్యులర్ గా నడిచే టెండర్ లను గ్యాప్ లేకుండా కంటిన్యూ చేయాలని, వెంటనే టెండర్లు పిలవాలని కోరారు.కన్వేయన్స్ వాహనాల 15% అడహాక్ పేమెంటు సమస్యను వెంటనే పరిష్కరించాలి. సింగరేణిలో నడుస్తున్న ప్రైవేటు వాహనాల డ్రైవర్ల సీఎంపిఎఫ్ క్రింద సింగరేణి యాజమాన్యం కట్ చేసుకుని తమ దగ్గర పెట్టుకున్న 15% అడహాక్ పేమెంట్ వల్ల అనేకమంది యజమానులు, డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.యూనియన్ను ఐక్యంగా చైర్మన్ ని ఒప్పించి పరిష్కారానికి వేయించిన కమిటీ సమస్యల పరిష్కరించడానికి కృషి చేయాలని, ఈ విషయంలో తీవ్ర కాలయాపన జరుగుతుందని డైరెక్టర్ పా జోక్యం చేసుకొని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.అందుకు డైరెక్టర్ పా సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కే డబ్ల్యూ కృష్ణ ఫర్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కొత్తగూడెం బ్రాంచ్ కార్యదర్శి రమణ మూర్తి పాల్గొన్నారు.

## తూర్పు గుంటూరు సీనడు అధ్యక్షులుగా కనపర్తి ఆశీర్వాదం ఎన్నిక.







పొన్నూరు ( జనం రిపోర్టర్ ): తూర్పు గుంటూరు సీనడు ఏ ఈ ఎల్ సి అధ్యక్షుడిగా కనపర్తి ఆశీర్వాదం ఎన్నికయ్యారు .గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలోని టౌన్ ఏ ఈ ఎల్ సి దేవాలయంలో గురువారం తూర్పు గుంటూరు సీనడు రెండవ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మేడరేటర్ బిషప్ ఏఈ ఎల్ సి మోస్ట్ రెవరెండ్ చింతల ఏలియా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తూర్పు గుంటూరు సీనడ్ అధ్యక్షులుగా పాత పొన్నూరు ఏఇ ఎల్ సి టౌన్ చర్చి సంఘ కాపరి రైట్ రెవరెండ్ కనపర్తి ఆశీర్వాదం ను 2025 - 2030 వరకు తూర్పు గుంటూరు సీనడు అధ్యక్షులుగా ప్రకటించడం జరిగింది. సమావేశమునకు తూర్పు గుంటూరు సీనడుకు చెందిన బిషప్పులు, గురువులు, అభిషక్త డెలిగేట్లు పాల్గొన్నారు.

# వేలేరుపాడులో శుక్రవారం ఆర్ డి వో ఆధ్వర్యంలో మాక్ ఎక్సర్ సైజ్ కార్యక్రమం

వేలేరుపాడు:ఏ(జనం రిపోర్టర్) :శ్రీయుత మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ విజయవాడ వారు ఆధ్వర్యంలో గోదావరి వరదలు సమయంలో ఏవిధంగా ఎదుర్కొనవలేనో అనే విషయములపై అన్నీ శాఖల వార్లచే గత నెల మార్చి 25.03.2025 తేదిన జూమ్ మీటింగ్ ద్వారా ఓరియంటేషన్ ఇచ్చారని మరియు ఈరోజు అనగా 03.04.2025 తేదిన మధ్యాహ్నం 03.00 గంటల నుండి 04.00 గంటల వరకు ఏలూరు జిల్లా సంబందిత అధికారులతో టేబుల్ టాప్ మాక్ ఎక్షర్ సైజ్ అనగా వరదల సమయములో డిపార్ట్ మెంట్ల వారిగా చేయవలసిన పనులపై సూచనలు ఇచ్చారని, మండల తహసీల్దార్ ఒక ప్రకటనలో తెలియజేసారు, శుక్రవారం ఉదయం 09.00 నుండి చిగురుమామిడి గ్రామములో వరదల సమయములో డిపార్ట్ మెంట్ల వారిగా చేయవలసిన పనులను చేసి చూపిస్తారని, మొదటగా రేపాకగొమ్ము గ్రామమును మాక్ ఎక్షర్ సైజ్ కొరకు ఎంచుకోవడం జరిగిందని, కానీ మాక్ ఎక్షర్ సైజ్ నిర్వహించుట కొరకు గోదావరిలో నీరు తక్కువగా ఉండుట వలన చిగురుమామిడి గ్రామమునకు మార్పు చేయడం జరిగినదని, ఈ ఫిజికల్ మాక్ ఎక్షర్ సైజ్ నకు శ్రీయుత రెవిన్యూ డివిజనల్ అధికారి, జంగారెడ్డిగూడెం యం.వి.రమణ గారు నోడల్ ఆఫీసర్ గా నియమించబడ్డారని. ఈ కార్యక్రమములో రెవిన్యూ, పంచాయతీ రాజ్, పోలీసు, మెడికల్, ఫైర్, ఆర్ %డ% బి, ఇరిగేషన్, ఎలెక్ట్రికల్, ఫిషరీస్, , ట్రాన్స్ పోర్ట్, వెటర్నరీ మరియు ఆపదమిత్ర వాలంటీర్లు తదితర శాఖల వారు పాల్గొంటారని నోడల్ ఆఫీసర్ అయిన శ్రీయుత రెవిన్యూ డివిజనల్ అధికారి, జంగారెడ్డిగూడెం వారు తెలిపారని ఈ సమావేశంలో తెలియ చేయడం జరిగింది.

## పులుమామిడి గ్రామంలో 2025 సంవత్సరం ఏప్రిల్ మొదటి వారంలో ఉపాధి కూలీల పని ప్రారంభించిన మాజీ సర్పంచ్ మేడిపల్లి వెంకటయ్య..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి : నవాబుపేట్(జనం రిపోర్టర్) : నవాబుపేట మండల పరిధిలోని పులుమామిడి గ్రామంలో 2025 సంవత్సరం లో ఏప్రిల్ లో ఉపాధి హామీ కూలీలకు అను దినాన్ని ప్రారంభించిన పుల్మాండ్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మేడిపల్లి వెంకటయ్య ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మగల రామచంద్రయ్య అనిని ప్రారంభించారు. వెంకటయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సందర్భంగాఒక రోజుకుపని చేసిన ఉపాధి కులికి 307 రూపాయలు ప్రభుత్వం అందుస్తుంది దానిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారుపులు మామిడిగ్రామం లో1475.మందిఉపాధిలో పని చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఉపాధి హామీలు పని చేసుకోవాలని అన్నారు. ఉపాధి హామీకి కూలీలు ఉదయం 7:30 నుండి 12:30 వరకు పని చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరూ పనిచేసిన వారికి డబ్బులు కచ్చితంగా మన అకౌంట్లో జమ ధైతాయని ఫీల్డ్ అసిస్టెంట్ రామచంద్రయ్య అన్నారు. ఉపాధి హామీలో పని చేసిన వారందరికీ డబ్బులు తప్పకుండా వస్తాయి ఉపాధి హామీలు పని చేసిన వారందరికీ త్రాగడానికి మంచినీరు. కూలి చేసేవారికి ఎలాంటి దెబ్బలు తగిలిన వారికి మెడిసిన్. ఎండాకాలం కారణంగా ఇలాంటి ఇబ్బందులు కలగకుండా అందరు పనిచేసి చెట్ల కింద ఉండాలని అన్నారు. ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని వారికి కావలసిన గడ్డపారలు. గంపలు. పొడలు ప్రభుత్వం అందించింది అన్నారు. దాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్క పోలీస్ సంవత్సరానికి వంద రోజులు పని చేయాలి రెండున్నర మీటర్లు గుంతలు చేయాలని అన్నారు. మార్చి 31 వరకు గత సంవత్సరం పూర్తి కావడంతో ఏప్రిల్ రెండవ తేదీ నుండి 2025 సంవత్సరం పని జరుగుతుందని ఆ పనికి ప్రతి ఒక్కరూ అందరూ హాజరై ఉపాధి పని చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రతిరోజు కూలీలకు 307 రూపాయలు అందిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ఉపాధి హామీ కూలీలు మాజీ ఉప సర్పంచ్ ఊ రెల్ల సుధాకర్, నక్క గోపాల్, తోలు కట్టే గోపాల్, లింగయ్య, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.




## హెచ్ సీ యూలో ఏం జరుగుతోంది




సిటీ ఇంచార్జ్ అనిల్ కుమార్, (జనం రిపోర్టర్) :హైదరాబాద్, ఏప్రిల్ 3:ప్రభుత్వం చాలా క్లియర్గా చెబుతోంది. కంచ గచ్చిబౌలిలోని ఆ 400 ఎకరాలు సర్కారువేనని. అయినా, %ఎజఖ% తిరకాసు పెడుతోంది. విద్యార్థి సంఘాలు రెచ్చిపోతున్నాయి. బీజేపీ, బీఆర్ఎస్ మరింత అగ్గి రాజేస్తున్నాయి. మంగళవారం ఆందోళనలు, అరెస్టులతో వర్సిటీ ఉద్రిక్తంగా మారింది.%ఎజఖ% దగ్గరికి వెళ్లకుండా రాజకీయ పార్టీల నేతలను ఉదయం నుంచే పోలీసులు అడ్డుకున్నారు. హైదర్గూడ %మీూూ% క్వార్టర్స్లోనే బీజేపీ ఎమ్మెల్యేలను హౌజ్ అరెస్ట్ చేశారు. మహేశ్వర్రెడ్డి, పాయల్ శంకర్ తదితరులు పోలీసులతో గొడవకు దిగినా.. వారిని కంట్రోల్ చేశారు. అటు.. కేటీఆర్, హరీశ్రావు ఇంటి దగ్గర కూడా పోలీసులు భారీగా మోహరించారు.బడా లీడర్లను ఇంటి నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నా.. ద్వితీయ శ్రేణి నాయకులు మాత్రం %ఎజఖ% కు భారీ సంఖ్యలో చేరుకున్నారు. బీజేవైఎం నేతలు వర్సిటీ గేటు ముందు ఆందోళనకు దిగారు. జంతు ప్రేమికుడిని అంటూ బీజేపీ నేత చికోటి ప్రవీణ్ తన అనుచరులతో హెచ్సీయూ ముందు హంగామా చేశారు. పోలీసులు వారందరినీ అదుపులోకి తీసుకుని వేరే వేరే పోలీస్ స్టేషన్లకు తరలించారు. యూనివర్సిటీ ముందు పెద్ద సంఖ్యలో పోలీసులు కాపలా కాస్తున్నారు.మరోవైపు, 400 ఎకరాల కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం హైకోర్టును చేరింది. ఆ భూమిని జాతీయ ఉద్యానవనంగా ప్రకటించాలంటూ 'వట ఫౌండేషన్' కోర్టులో పిల్ వేసింది. ఇలా.. ఆ భూములపై పెద్ద స్థాయిలో రచ్చ నడుస్తోంది.వరుస పరిణామాలపై కాంగ్రెస్ సర్కారు సీరియస్గా ఉంది. అభివృద్ధి కోసం, ఐటీ కంపెనీల కోసం ప్రభుత్వ భూమిని అమ్మితే ఇంతలా రచ్చ చేయడం ఏంటని ముఖ్యమంత్రి మండిపడుతున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం భూములు అమ్మలేదా? అని నిలదీస్తున్నారు. సెంట్రల్ యూనివర్సిటీ కేంద్రం పరిధిలో ఉంది కాబట్టి.. బీజేపీ పార్టీ ఈ ఇష్యూను కావాలనే రచ్చ చేస్తోందని తప్పుబడుతున్నారు. ఆ 400 ఎకరాలు గవర్నమెంట్ ల్యాండేనని పక్కాగా పత్రాలు, ఆధారాలు చూపిస్తున్నా ఇంకా ఈ గొడవేందని ఫైర్ అవుతున్నారు. సర్కారుకు సపోర్ట్గా కాంగ్రెస్ నేతలు సైతం గొంతు విప్పుతున్నారు. బీఆర్ఎస్, బీజేపీలు ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారంటూ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు.2004లో ఉమ్మడి ఏపీకి సీఎంగా ఉన్న చంద్రబాబు ఆ 400 ఎకరాల భూమిని %×వీ+% సంస్థకు కేటాయించారు. ముఖ్యమంత్రులు మారినా ఆ ల్యాండ్ వద్దే ఉంది. రేవంత్రెడ్డి సీఎం అయ్యాక.. సుప్రీంకోర్టులో పోరాడి ప్రభుత్వ భూమిని తిరిగి దక్కించుకున్నారు. 20 ఏళ్లుగా భూమి వివాదంలో ఉంది కాబట్టి అక్కడ చెట్లు పెరిగాయి. అంతే కానీ అవి అటవీ భూములు కాదని.. కావాలనే ప్రతిపక్ష పార్టీలు తప్పుదారి పట్టిస్తున్నాయని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. జింక చనిపోయిందని ఫేక్ పోస్టులు పెట్టి.. ఆ తర్వాత ట్వీట్లు డిలీట్ చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో అభివృద్ధిని ఆపే ప్రయత్నం చేస్తున్నారని.. పర్యావరణ వేత్తలను తప్పుదారి పట్టిస్తున్నారు ఆరోపించారు. హెచ్సీయూ కేంద్రం చేతిలో ఉంది కాబట్టి.. వర్సిటీ రిజిస్ట్రార్ బీజేపీ పెద్దలు చెప్పినట్టు చేస్తున్నారని ఎంపీ చామల విమర్శించారు. 400 ఎకరాల భూమిని యూనివర్సిటీ భూమిగా చెబుతూ విద్యార్థులను రెచ్చ గొడుతున్నారని మండిపడ్డారు.

## గులాబీ నేతల్లో కొత్త జోష్..




సిటీ ఇంచార్జ్ అనిల్ కుమార్, (జనం రిపోర్టర్) :హైదరాబాద్, ఏప్రిల్ 3:బీఆర్ఎస్ నేతల్లో ప్రస్తుతం ఆనందం కనిపిస్తుంది. వచ్చే ఎన్నికల్లో వచ్చేది తమ ప్రభుత్వమేనని భావిస్తున్నారు. అందుకే నేతలతో పాటు రోడ్డు మీదకు క్యాడర్ చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలియజేస్తుంది. కాంగ్రెస్ ఇచ్చి ఆరు గ్యారంటీలే తమను ఈసారి అధికారానికి తెస్తాయని నమ్ముతున్నారు. గ్యారంటీలు అందరికీ అందకపోవడంతో పాటు కేసీఆర్ తన హయాంలో అమలు చేసిన పథకాలను ఇప్పటివరకూ అమలు చేయకపోవడం తమకు ప్లస్ పాయింట్ గామారుతుందని అంచనా వేస్తున్నారు. ప్రధానంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటివి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ ఇంత వరకూ అమలు చేయకపోవడంపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని గమనించింది. జిల్లాల్లో, మండలాల్లో బీఆర్ఎస్ నేతలకు ప్రజల నుంచి వస్తున్న స్పందన ఇందుకు కారణమని చెప్పారు. కల్యాణ లక్ష్మి పథకం కింద లక్ష రూపాయల నగదు, తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికలకు ముందు వాగ్దానం చేయడం, ఇప్పటికే అనేక పెళ్లిళ్లు జరిగిపోవడంతో వారు తమకు రావాల్సిన డబ్బులు రాలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. అనేక పథకాలు అమలు చేసినా అవి కొందరికే అమలుకావడం కూడా తమకు కలసి వస్తుందని నమ్ముతున్నారు ఇక హ్యాపీస్ సోషల్ మీడియాలో కూడా... దీంతో పాటు సోషల్ మీడియాలో కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్ రెండు అడుగుల ముందే ఉంది. బీఆర్ఎస్ సోషల్ మీడియా ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయాన్ని తప్పుపడుతూ బీఆర్ఎస్ సోషల్ మీడియా వింగ్ పోస్టులు పెడుతుంది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వివాదంపై కూడా బీఆర్ఎస్ సోషల్ మీడియాదే పైచేయిగా మారింది. దీంతో పాటు ఇటీవల కొన్ని సర్వే సంస్థలు వెల్లడిస్తున్న నివేదికలు కూడా తమకు అనుకూలంగా ఉన్నాయని, తమ ప్రభుత్వం ఎప్పుడు వస్తుందా? అని ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని గులాబీ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ నెల 27వ తేదీన బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం జరిగిన తర్వాత కేసీఆర్ కూడా ప్రజల్లోకి వచ్చే అవకాశముందని ఇక కాంగ్రెస్ పార్టీకి చుక్కలు కనిపిస్తాయంటున్నారు.

# ప్రజల ప్రయోజనాల కోసం తాము ఎప్పుడైనా శాంతి చర్చలకు సిద్ధమే..

### మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్

### శాంతి చర్చల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలి

### శాంతి చర్చల కమిటీకి,దేశంలోని ప్రజాపక్ష మేధావులకు, రచయితలకు, ప్రింట్, ఎలక్ట్రానిక్, జర్నలిస్టులకు, హక్కుల సంఘాలకు విజ్ఞప్తి



జనం రిపోర్టార్, సిటీ ఇంచార్జ్ అనిల్ కుమార్, (జనం రిపోర్టర్) : ప్రజల ప్రయోజనాల కోసం తాము ఎప్పుడైనా శాంతి చర్చలకు సిద్ధమేనని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ఓ ప్రకటనలో వెల్లడించారు. శాంతి చర్చల కోసం సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందు ప్రతిపాదన చేస్తున్నామన్నారు. అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కగార్ పేరుతో ఛత్తీస్గఢ్, మహారాష్ట్ర (గడ్చిరౌలి), ఒడిశా, ఝూర?ండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో చేస్తున్న హత్యాకాండలను, నరసంహారాన్ని(జినోసైడ్) నిలిపివేయాలని , సాయుధ బలగాల కొత్త క్యాంపుల ఏర్పాటును ఆపివేయాలని ప్రతిపాదిస్తున్నామని తెలిపారు. కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందిస్తే తాము తక్షణమే కాల్పుల విరమణ ప్రకటిస్తామని వెల్లడించారు. తాము చేస్తున్న ఈ ప్రతిపాదనల ఆధారంగా శాంతి చర్చల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని శాంతి చర్చల కమిటీకి,దేశంలోని ప్రజాపక్ష మేధావులకు, రచయితలకు, ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా జర్నలిస్టులకు, హక్కుల సంఘాలకు, ఆదివాసీ, దళిత సంఘాలకు, విద్యార్థియువజనులకు, పర్యావరణ కార్యకర్తలు తదితరులందరికీ విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. శాంతి చర్చల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేలా దేశవ్యాప్తంగా అన్ని పట్టణాల్లో, నగరాల్లో, జిల్లా, తాలూకా కేంద్రాల్లో, యూనివర్సిటీల్లో ప్రచార క్యాంపెయిన్ను చేపట్టాల్సిందిగా కోరుతున్నామని తెలిపారు. పెట్టుబడిదారీ, భూస్వామ్య వ్యవస్థను కూలదోసి సమసమాజ స్థాపన కోసం పోరాడుతుంటే బిజెపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర పార్టీల రాష్ట్ర ప్రభుత్వాలు ఆ ప్రజా పోరాటాలను నిర్మూలించడం కోసం తూర్పు, మధ్యభారతంలో కగార్ యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయన్నారు. సామ్రాజ్యవాదుల, దళారీ పెట్టుబడిదార్ల, భూస్వాముల దోపిడీ, పీడనల నుండి దేశంలోని పీడిత ప్రజల, పీడిత సాంఘిక సముదాయాల, పీడిత జాతుల విముక్తి కోసం మా పార్టీ పోరాడుతుంటే ఆ పోరాటాలను అణిచివేయడానికి పట్టణాల్లో, మైదానాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాయుధ పోలీసు బలగాల్ని, ఎన్ఐఎ లాంటి ఇంటలిజెన్స్ ఏజెన్సీలను ఉపయోగించి పోరాడే ప్రజానీకంపై దాడులు చేస్తున్నాయని సదరు ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాపక్ష మేధావులపై భీమాకోరేగావ్ కుట్ర కేసును మోపి జైల్లో బంధించాయన్నారు. విప్లవోద్యమ ప్రాంతాల్లో ఆదివాసీ యువతీయువకులను సాయుధ బలగాల్లో భర్తీ చేసుకుని వారిచేతనే ఆదివాసులను హత్యలు చేయిస్తున్నాయని ప్రకటనలో వెల్లడించారు. శాంతి చర్చల కోసం సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేయడం కోసం 'కగార్' పేరుతో ఆదివాసీ ప్రజానీకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న హత్యాకాండను నిలిపివేయాలని, బస్తర్ ప్రాంతంలో మోహరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సాయుధ బలగాలను బ్యారక్లకే పరిమితం చేయాలని, సాయుధ బలగాల కొత్త క్యాంపుల ఏర్పాటు నిలిపివేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదన చేశారు. ఈ ప్రతిపాదన పట్ల స్పందించకుండా, జవాబు ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత 15 నెలలుగా విప్లవోద్యమ ప్రభావిత రాష్ట్రాలన్నింటా.. ముఖ్యంగా ఛత్తీస్గఢ్లో ప్రతిఘాతక 'కగార్' యుద్ధాన్ని తీవ్రంగా కొనసాగిస్తున్నాయన్నారు.ఈ యుద్ధంలో దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 400కు పైబడిన సంఖ్యలో తమ పార్టీ నాయకులను, కార్యకర్తలను, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యానికి చెందిన వివిధ స్థాయిల కమాండర్లను, సభ్యులను, సాధారణ ఆదివాసీ ప్రజానీకాన్ని హత్య చేశాయన్నారు. ఇందులో 1/3 సంఖ్యలో సాధారణ ఆదివాసీ ప్రజలు హత్య చేయబడ్డారన్నారు. విప్లవోద్యమ ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయుధ బలగాలు వేలాది మందిని అరెస్టులు చేసి అక్రమ కేసులు మోపి జైళ్ల పాల్జేస్తున్నాయని వెల్లడించారు. ఈ క్రమంలో 'మధ్యభారతంలో జరుగుతున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలి. భారత ప్రభుత్వంసిపిఐ(మావోయిస్టు) బేషరతుగా కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరపాలి' అనే అంశంపై మార్చి 24న హైదరాబాద్లో శాంతి చర్చల కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిందన్నారు. నేటి స్థితిలో శాంతి చర్చల కమిటీ ఏర్పాటును, అది శాంతి కోసం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా శాంతి చర్చల పట్ల తమ పార్టీ వైఖరిని తెలియపరుస్తూ.. పజల ప్రయోజనాల కోసం తాము ఎప్పుడైనా శాంతి చర్చలకు సిద్ధమేనని సదరు ప్రకటనలో పేర్కొన్నారు.

## తెదేపా సభ్యత్వం కార్డులు పంపిణీ..



పొన్నూరు (జనం రిపోర్టర్) :పొన్నూరు నియోజకవర్గం శాసనసభ్యులు, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆదేశాల మేరకు పొన్నూరు మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గురువారం పొన్నూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ సభ్యత్వం కార్డులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ ఎలక్షన్ పోల్ మేనేజ్మెంట్ కో-ఆర్డినేటర్ మాదల వెంకటేశ్వరరావు, గుంటూరు పార్లమెంట్ రైతు విభాగ ప్రధాన కార్యదర్శి బొర్రు రామరావు , పొన్నూరు మండల పార్టీ అధ్యక్షులు బండ్లమూడి బాబురావు, నీటి సంఘం డిసిఅధ్యక్షులు గనిపిశెట్టి రామకృష్ణ, పార్టీ నాయకులు పాల్గొనడం జరిగింది.

## ఎల్కలపల్లి గేట్ గ్రామాన్ని గ్రామపంచాయతీగానే కొనసాగించాలి....

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కు వినతి పత్రం అందించిన గ్రామ యువకలు...**



రామగుండం:(జనం రిపోర్టర్) :రామగుండం:ఏప్రిల్ 03.ఎఫ్ సి ఐ ఎల్కలపల్లి గేట్ గ్రామాన్ని రామగుండం కార్పొరేషన్ లో విలీనం చేస్తున్నారు అనే వార్తల దృష్ట్యా, ఈ గ్రామంలో నెలకొన్నటువంటి సమస్యలను వివరించి ఈ గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగానే కొనసాగించాలనే గ్రామస్తుల అభిప్రాయం మేరకు, బండి సాయికుమార్, దబ్బెట భానుచందర్, దబ్బెట చరణ్ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించడం జరిగింది, ఇందుకు గాను గ్రామ ప్రజలు, గ్రామ యువకులు బండి సాయికుమార్, దబ్బెట భానుచందర్, దబ్బెట చరణ్ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతి పేదవానికి నాణ్యమైన సన్నబియ్యాన్ని అందించాలి:- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య..!!




వికారాబాద్ జిల్లా ప్రతినిధి : నవాబుపేట్ (జనం రిపోర్టర్) :నవాబ్ పేట్ మండల కేంద్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన చౌక ధరల దుకాణంలో రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీని ప్రారంభించిన చేవెళ్ల స్థానిక శాసనసభ్యులు "కాలే యాదయ్య"ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... ప్రజా పంపిణీ పథకంలో భాగంగా చౌక ధరల దుకాణాల ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఒక్కరికి 6 కిలోల చొప్పున సన్న బియ్యాన్ని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.అనంతరం నవాబ్ పేట్ మండలానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన 20,02,320/- (రూపాయలు ఇరవైలక్షల రెండువేల మూడువందలఇరవై) విలువ గల 20 కల్యాణ లక్ష్మీ / షాదీ ముబారక్చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మండల పిఎసిఎస్ చైర్మన్ పోలీస్ రామిరెడ్డి, మండల తాసిల్దార్ జయరాం, జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు సోమనోళ్ళ జుకర్ రెడ్డి, నవాబుపేట్ డీలర్ మల్లేశం, మండలం వ్యవసాయ కమిటీ డైరెక్టర్లు కందద నరసింహారెడ్డి , రాజశేఖర్ రెడ్డి, మమ్మద్ ఖదీర్, తలారి కుమార్, కౌకుంట్ల వెంకటేశం, కందద నాగిరెడ్డి,ప్రజాప్రతినిధులు, అధికారులు, మాజీప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## వీర జవాన్ సుబ్బయ్య కుటుంబ సభ్యులను కలిసిన ఆర్డీఓ వెంకట నాయుడు



నార్పల(జనం రిపోర్టర్) :ఇటీవల ఆర్మీ లో ల్యాండ్ మైన్ పేలి సహచర సైనికుల ప్రాణాలను కాపాడి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఆర్మీ జవాన్ వి వెంకట సుబ్బయ్య భార్య లీలావతి, సుబ్బయ్య పిల్లలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం ఆర్డీవో వెంకట నాయుడు తహసీల్దార్ అరుణకుమారి, ఇన్చార్జి ఎంపీడీవో ఉమాదేవి, డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాస్ మూర్తితో కలిసి జవాన్ సుబ్బయ్య కుటుంబ సభ్యులను కలిసారు. అనంతరం వారితో మాట్లాడి వారి కుటుంబ వివరాలతోపాటు వారి స్థితిగతులను తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి వీర జవాన్ సుబ్బయ్య కుటుంబానికి వచ్చే ఆర్థిక పరిహారం కుటుంబానికి అందేవిధంగా కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారని, ఆర్మీ నుండి రావలసిన నివేదికలు రాగానే సుబ్బయ్య భార్యా పిల్లలకు అందజేయడం జరుగుతుందని ఆర్డీవో కుటుంబ సభ్యులకు తెలిపారు. సుబ్బయ్య భార్య లీలావతి తనకు ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని కోరగా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆర్డీవో తెలిపారు పిల్లలను బాగా చదివించాలని సుబ్బయ్య భార్య లీలావతి కి ఆర్డీవో వెంకట నాయుడు కోరారు. సుబ్బయ్య మామ రామకృష్ణను, ఇతర కుటుంబ సభ్యులను ఆర్డిఓ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోతోపాటు గాండ్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాము, వీఆర్వో రామాంజనేయులు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

## మూసీ నదిలో చిక్కుకుపోయిన ఇద్దరు మేస్త్రీలు



మూసీ నది మధ్యలో ఉన్న శివాలయంలో పనులు చేసేందుకు వెళ్లిన ఇద్దరు కార్మికులు వరద నీటిలో చిక్కుకుపోయారు. ఎల్బీనగర్, ఏప్రిల్ 3 : మూసీ నది మధ్యలో ఉన్న శివాలయంలో పనులు చేసేందుకు వెళ్లిన ఇద్దరు కార్మికులు వరద నీటిలో చిక్కుకుపోయారు. చైతన్యపురి ఫణిగిరి కాలనీలోని కొసగుండ్ల లక్ష్మీ నర్సింహ్మాస్వామి దేవాలయం పక్కన శివాలయం మూసీ మధ్యలో ఓ బండపై ఉంది. ఈ ఆలయంలో ఓ దిమ్మెను నిర్మించేందుకు నాగోలు ప్రాంతానికి చెందిన ఇద్దరు మేస్త్రీలు నాగేందర్, వీరయ్యలకు నిర్వాహకులు పురమాయించారు.కాగా గురువారం ఉదయం వాతవరణం అనుకూలంగా ఉండటంతో వారు మూసీ మధ్యలో ఉన్న శివాలయం వద్దకు చేరుకుని పనులు చేపట్టారు. అయితే గురువారం సాయంత్రం మూడున్నర గంటల నుండి భారీగా కురిసిన వర్షంతో వరదనీరు అన్ని ప్రాంతాల నుండి మూసీ నదికి పోటెత్తింది. దీంతో మేస్త్రీలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. శివాలయం చుట్టూరా వరదనీరు చేరడంతో గట్టువైపు వచ్చేందుకు వీలు లేకుండా పోవడంతో మధ్యలో చిక్కుకుపోయిన నాగేందర్, వీరయ్యలు ఫోన్ ద్వారా తమ బంధువులకు సమాచారం అందించారు. అంతకంతకు మూసీ నదిలో వరదనీరు పెరుగుతుండటం ఫణిగిరి కాలనీ వైపు వచ్చే వీలు లేకపోవడంతో రాత్రి వరకు వారు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఈ సమాచారం తెల్సిన వెంటనే సరూర్నగర్ సర్కిల్ ఉప కమిషనర్ సుజాత, చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్త మూసీ పరివాహక ప్రాంతానికి చేరుకుని కార్మికులను రక్షించేందుకు డీఆర్ఎఫ్ బృందాలను రప్పించారు. వరద ఉధృతి పెరిగి మునిగిపోతామనే భయాందోళనలో ఉన్న కార్మికులకు వారు ధైర్యం చెప్పారు.మూడు గంటల పాటు శ్రమించిన డీఆర్ఎఫ్ బృందాలు మూసీ నది మధ్యలో శివాలయం వద్ద చిక్కుకుపోయిన కార్మికులను రక్షించేందుకు డీఆర్ఎఫ్ బృందాలు మూడు గంటల పాటు శ్రమించి చివరకు వారిని క్షేమంగా కాపాడారు. మూడు గంటల పాటు కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్త, ఉప కమిషనర్ సుజాతతో పాటుగా అధికారులు మూసీ నది ఒడ్డున ఉండి పనులను పర్యవేక్షించారు. చివరికి ఇద్దరు మేస్త్రీలు క్షేమంగా బయట పడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## అమెరికా టారిఫ్‌లపై మీ వైఖరేంటి : రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. అమెరికా సుంకాల పెంపుపై మోడీ ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని అన్నారు. గురువారం లోక్‌సభలో జీరో అవర్‌లో రాహుల్‌గాంధీ మాట్లాడారు. అమెరికా విధించిన సుంకాలు భారత ఆర్థిక వ్యవస్థను ముఖ్యంగా ఆటో పరిశ్రమ, ఔషధాలు మరియు వ్యవసాయ రంగాలను పూర్తిగా నాశనం చేయనున్నాయని అన్నారు. ఎవరో ఒకసారి ఇందిరా గాంధీని అడిగారు. విదేశాంగ విధానంలో మీరు ఏవైపు మొగ్గుచూపుతారు. కుడి వైపుకా, ఎడమవైపుకా అని ప్రశ్నించారు. తాను భారతీయురాలినని, ఏవైపు మొగ్గ చూపనని, నేరుగా నిలబడతానని ఇందిరాగాంధీ సమాధానమిచ్చారని అన్నారు. కానీ బిజెపి, ఆర్ఎస్ఎస్‌లకు భిన్నమైన మనస్తత్వమని, వారు కుడి, లేదా ఎడమ ఏ వైపుకి మొగ్గుచూపుతారని అడిగినప్పుడు .. తాము ప్రతి విదేశీయుడి ముందు తలవంచుతామని చెబుతారని అన్నారు. ఇది వారి సంస్కృతిలో, చరిత్రలో ఉన్న విషయమని, అందరికీ తెలుసునని అన్నారు. చైనా భారత్ భూభాగంలో 4,000 చ.కిమీ ఆక్రమించుకుందని ఆరోపించారు.

## తెలంగాణలో వానలు - పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్



తెలంగాణ : తెలంగాణలోని పలు జిల్లాలో వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆయా జిల్లాల్లో వడగండ్ల వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం కూడన్‌పల్లి సమీపంలో పిడుగుపాటుకు ఇద్దరు మహిళలు మృతి చెందారు. మరికొందరికి గాయాలయ్యాయి. వ్యవసాయ పనులు చేస్తుండగా పిడుగుపడటంతో ఇద్దరు మహిళలు చనిపోయారు. నేటి నుంచి వచ్చే నాలుగు రోజుల వరకు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఒడిశా నుంచి కోమోరిన్ ప్రాంతం వరకూ ఉన్న ద్రోణి, చత్తీస్‌గఢ్‌లో ఏర్పడిన ఉన్నత వాయు చక్రవాత తుపాను ప్రభావంతో వాతావరణ మార్పులు చోటు చేసుకుంటాయని.. రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయన్నారు. ఇవాళ మధ్యాహ్నం 3 వరకు ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో పాటుగా దట్టమైన మేఘాలు కమ్ముకుంటాయని చెప్పారు. ఇప్పటికే కొన్ని జిల్లాలకు ఐఎండీ అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. నిజామాబాద్, కామారెడ్డి, హైదరాబాద్, ఆదిలాబాద్ పరిసరాల్లో గంటకు 30-50 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీస్తాయని అధికారులు తెలిపారు. నేడు, రేపు ఆదిలాబాద్, వికారాబాద్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో పిడుగులు పడతాయని హెచ్చరించారు. ప్రజలు బయట తిరగడం తగ్గించి, ఆశ్రయం కోసం సురక్షిత ప్రదేశాలను ఎంచుకోవాలని సూచించారు.

## కంచ గచ్చిబౌలి భూములపై నివేదిక ఇవ్వండి

తెలంగాణ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వ్యవహారంపై దేశ అత్యున్నత న్యాయస్థానం





సుప్రీం కోర్టులో గురువారం విచారణ జరిగింది. ఇప్పటికే ఈ భూముల వేలంపై వర్సిటీ విద్యార్థులతోపాటు వట ఫౌండేషన్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన సంగతి విదితమే. తాజాగా సుప్రీం కోర్టు కంచ గచ్చిబౌలి భూములపై సంచలన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం విక్రయించాలనుకున్న భూములను సందర్శించి మధ్యాహ్నం 3 గంటల 30 నిముషాలకు నివేదిక ఇవ్వాలని రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీ చేసింది. అలాగే తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు గచ్చిబౌలి భూముల్లో ఎలాంటి చర్యలు చేపట్టకూడదని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఇదిలా ఉండగా . ఆ 400 ఎకరాల భూమి 30 సంవత్సరాలుగా వివాదంలో ఉందని ప్రభుత్వ తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఇప్పటికే ఈ భూముల వేలంపై విద్యార్థులతో పాటు పలు రాజకీయ పార్టీలు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. ఆందోళనలు చేసిన సంగతి విదితమే. అయితే ప్రభుత్వ నిర్ణయంపై పలువురు తెలంగాణ హైకోర్టు తో పాటు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై వటా ఫౌండేషన్ కోర్టులో పిల్ దాఖలు చేసింది. ఈ భూమిలో ప్రభుత్వ వేలాన్ని నిలిపివేయాలని, వన్యప్రాణులకు ఆవాసమైన ఆ స్థలాన్ని జాతీయ పార్కు గా ప్రకటించాలని ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేసింది. ఈ పిల్ పై బుధవారం తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. నేడు కోర్టు మాట్లాడుతూ గచ్చిబౌలి భూముల్లో చెట్ల నరికివేతలు నిలిపివేయాలని కీలక ఆదేశాలు జారీ చేసింది.

## గాజాపై ఇజ్రాయిల్ దళాలు దాడి : 80 మంది మృతి



గాజా : బుధవారం రాత్రి గాజాలోని ఖాన్ యూనస్ నగరంలోని నివాస భవనాలపై ఇజ్రాయిల్ సైన్యం వైమానిక దాడికి పాల్పడింది. ఇజ్రాయిల్ సైన్యం గాజా అంతటా జరిపిన బాంబు దాడుల్లో 80 మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. ఈ దాడి తర్వాత శిథిలాల కింద చిక్కుకున్న పాలస్తీనియన్ల కోసం గాజా పౌర రక్షణ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. మరోవైపు జబాలియా శరణార్థి శిబిరంలోని ఐక్యరాజ్యసమితి వైద్య సౌకర్యాల స్థావరంపైనా ఇజ్రాయిల్ దాడి చేసిందని, ఈ దాడిలో మహిళలు, చిన్నారులతో సహా 22 మంది మృతి చెందారని ఆరోపణలను ఇజ్రాయిల్ ఖండించింది. సిరియా, డమాస్కస్, హమాస్ గవర్నరేట్‌లపై ఇజ్రాయిల్ సైన్యం దాడి చేసినట్లు ఇజ్రాయిల్ సైన్యం ధృవీకరించింది. కాగా, మరోవైపు సిరియాపై ఇజ్రాయిల్ సైన్యం దాడి చేసింది. ఇజ్రాయిల్ సైన్యం చేసిన తాజా దాడిలో 9 మంది పౌరులు మృతి చెందారని, పలువురు గాయపడ్డారని దక్షిణా సిరియాలోని డెరా గవర్నరేట్‌లోని ప్రావిన్షియల్ ప్రభుత్వం తెలిపింది. సిరియా రాజధాని డమాస్కస్, మధ్య ప్రావిన్స్ హమాపై ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు బాంబు దాడికి పాల్పడ్డాయి. యెమెన్‌లోని హౌతి నియంత్రణలో ఉన్న ప్రాంతాలపై అమెరికా సైన్యం రాత్రిపూట దాడులు జరుపుతోంది. బుధవారం రాత్రి పౌరుల వాహనాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా దాడులకు పాల్పడుతోందని హౌతి మీడియా నివేదించింది.

# చాక్లెట్ పంట.. ధరలేక తంటా

### అంతర్జాతీయ మార్కెట్‌లో కోకో గింజల ధర కిలో రూ.770 పైమాటే
### వర్షాకాలం పంట పేరిట రూ.200-250కి మించి ధర ఇవ్వని వ్యాపారులు
### కొత్త పంటకు సైతం కిలోకు రూ.400-450 మాత్రమే చెల్లింపు
### గతేడాది ఇదే సమయంలో కిలో రూ.1,050 పలికిన ధర
### సిండికేట్‌గా ఏర్పడి రైతుల శ్రమను దోచేస్తున్న కంపెనీలు
### పట్టనట్టు వ్యవహరిస్తున్న కూటమి సర్కారు



అమరావతి: చాక్లెట్ పంట అన్నదాతకు చేదును పంచుతోంది. కంపెనీలు సిండికేట్‌గా మారి కోకో గింజల ధరల్ని అమాతం తగ్గించేయడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. కష్టకాలంలో ఆదుకోవాల్సిన ప్రభుత్వం కంపెనీలకు కొమ్ముకాస్తూ తమని పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. రాష్ట్రంలో 1.12 లక్షల ఎకరాల్లో కోకో తోటలు ఉండగా.. ఎకరాకు 3-4 క్వింటాళ్ల చొప్పున ఏటా 12 వేల టన్నుల గింజల దిగుబడి వస్తోంది. ఇందులో 80 శాతం గింజల్ని క్యాడ్బరీ, మిగిలింది నెస్లే, క్యాంపో్కో, లోటస్ తదితర కంపెనీలు సేకరిస్తున్నాయి. కోకో పంటకు నవంబర్ నుంచి జూన్ వరకు సీజన్. జూలై నుంచి అక్టోబర్ వరకు అన్ సీజన్. దిగుబడిలో రెండొంతులు సీజన్‌లోనూ, ఒక వంతు అన్ సీజన్‌లోనూ చేతికొస్తుంది. గతంలో సీజన్, అన్ సీజన్ అనే తేడా లేకుండా గింజలన్నింటినీ ఒకే రీతిలో అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా కంపెనీలు కొనుగోలు చేసేవి. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు.

### గతేడాది కిలో గింజల ధర రూ.1,050

గతేడాది ఇదే సమయంలో కిలో కోకో గింజలకు రూ.1,050 ధర లభించింది. ఈ ఏడాది కంపెనీలు సిండికేట్‌గా మారి అనూహ్యంగా ధరలు తగ్గించేయడంతో రైతులకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో గింజల ధర రూ.770కి పైగా పలుకుతుండగా, కంపెనీలు మాత్రం నాణ్యమైన (ప్రీమియం) గింజలకు సైతం రూ.400-450 మధ్య చెల్లిస్తున్నాయి. అన్‌సీజన్ గింజల్ని కొనేందుకు కంపెనీలు ఆసక్తి చూపడం లేదు. ఇదే అదునుగా ప్రైవేటు వ్యాపారులు కిలో రూ.200-250 మధ్య కొనుగోలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. ప్రస్తుతం కోతకు వచ్చిన సీజన్ పంటకు సైతం కంపెనీలు గిట్టుబాటు ధర చెల్లించేందుకు ముందుకు రావడం లేదు. కోతకు సిద్ధంగా ఉన్న పంట కాకుండా రైతుల వద్ద దాదాపు 1,500 టన్నులకు పైగా కోకో గింజల నిల్వలున్నాయి.

### దిగుమతుల వల్లే..

ఈ ఏడాది చాక్లెట్ కంపెనీలు విదేశాల నుంచి కోకో గింజలు, పొడి, బటర్ దిగుమతి చేసుకోవడంతో ఇక్కడి రైతులు పండించిన పంటకు డిమాండ్ లేకుండాపోయింది. కోకో రైతుల్లో అత్యధికులు కౌలుదారులే. ఎకరాకు రూ.1.10 లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకు కౌలు చెల్లిస్తుంటారు. తెగుళ్లు, చీడపీడలు, యాజమాన్య పనుల కోసం ఏటా రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడి పెడుతుంటారు. ఆశించిన స్థాయిలో దిగుబడులు రాక సతమతమవుతున్న రైతులు కంపెనీల మాయాజాలం వల్ల తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. సీజన్, అన్‌సీజన్‌తో సంబంధం లేకుండా అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా కోకో గింజల్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా.. ప్రభుత్వం జోక్యం చేసుకుని కంపెనీల మాయాజాలాన్ని అడ్డుకోవాలని ఏపీ కోకో రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ధరల స్థిరీకరణ నిధి పథకాన్ని కోకో రైతులకూ వర్తింప చేయాలని కోరారు. కోకో రైతులను ఆదుకోకపోతే ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

### ప్రభుత్వం స్పందించడం లేదు


ఎకరాకు రూ.1.40 లక్షల చొప్పున చెల్లించేలా 60 ఎకరాలను కౌలుకు తీసుకుని కోకో సాగు చేస్తున్నా. ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడులు అవుతున్నాయి. అన్‌సీజన్‌కు సంబంధించి 7 టన్నుల గింజలు ఉండగా.. కిలో రూ.330 చొప్పున 2.50 టన్నులు అమ్మాను. మిగిలిన 4.50 టన్నులు అమ్ముదామంటే కొనేవారు లేదు. సీజన్‌కు సంబంధించి 7 టన్నుల గింజల్ని కిలో రూ.550 చొప్పున కొన్నారు. ఇంకా 4 టన్నులు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పుడు కిలో రూ.450కు మించి కొనలేమని చెబుతున్నారు. మరో రెండు టన్నుల వరకు పంట రావాల్సి ఉంది. ఈ ఏడాది పెట్టుబడులు కూడా వచ్చేలా కనిపించడం లేదు. లీజుకు చెల్లించాల్సిన మొత్తం నష్టపోయినట్టే. పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఏమాత్రం స్పందించలేదు.

### రూ.45 లక్షలకు పైగా నష్టపోతున్నా

ఈ రైతు పేరు అవర్ని అనిల్‌కుమార్. ఏలూరు జిల్లా పెదవేగి మండలం రాయన్నపాలేనికి చెందిన ఈయన 150 ఎకరాలను కౌలుకు తీసుకుని.. ఎకరాకు రూ.1.40 లక్షల చొప్పున కౌలు చెల్లిస్తూ కోకో సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.40 వేల చొప్పున పెట్టుబడి అవుతోంది. ఎకరాకు 3.50 క్వింటాళ్ల చొప్పున కోకో గింజల దిగుబడి వచ్చింది. అన్ సీజన్(వర్షాకాలం)లో తీసిన పంటను కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. బతిమాలుకుంటే కిలోకు రూ.200-250 మించి ధర ఇచ్చేది లేదంటున్నారు. గతేడాది ఇదే సమయంలో సీజన్, అన్ సీజన్‌తో సంబంధం లేకుండా కిలో గింజలకు రూ.1,050 చొప్పున ధర దక్కింది. ఈ ఏడాది అమాంతం ధర తగ్గిపోవడంతో ఎకరాకు రూ.30 వేల చొప్పున మొత్తంగా తాను రూ.45 లక్షల మేర నష్టపోతున్నట్టు రైతు అనిల్‌కుమార్ ఘొల్లుమంటున్నారు. కోకో గింజల్ని కొనుగోలు చేసే కంపెనీలు సిండికేట్‌గా మారి ధరల్ని దారుణంగా తగ్గించేయడంతో కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన చెందుతున్నారు.

# బిల్లుపై ఎవరి వాదనేమిటి?

### వక్ఫ్ ఆస్తులు కాజేసే కుట్రే
### పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం
### విపక్షాలు, ముస్లిం సంఘాలు
### మెరుగైన నిర్వహణ కోసమే: కేంద్రం



వక్ఫ్. కొద్ది రోజులుగా దేశమంతటా చర్చనీయంగా మారిన అంశం. ఇస్లాం సంప్రదాయంలో ముస్లిం సమాజ ప్రయోజనం కోసం చేసే దానం లేదా విరాళాన్ని వక్ఫ్ అంటారు. వక్ఫ్ ఆస్తులన్నీ అల్లాకు చెందుతాయని భావిస్తారు. కనుక వాటి అమ్మకం, ఇతర ప్రయోజనాలకు వాడకం పూర్తిగా నిషిద్ధం. మసీదులు, మదర్సాలు, శ్మశానవాటికలు, అనాథాశ్రమాల నిర్మాణ నిర్వహణ తదితరాల నిమిత్తం ఉపయోగించాలి. భారత్‌లో వక్ఫ్ సంప్రదాయం 12వ శతాబ్దంలో ఢిల్లీ సుల్తానుల హయాంలో మొదలైంది. స్వాతంత్ర్యానంతరం 1954లో కేంద్ర వక్ఫ్ చట్టం వచ్చింది. దాని స్థానంలో 1995లో తెచ్చిన కొత్త చట్టం ద్వారా వక్ఫ్ బోర్డులకు మరిన్ని అధికారాలు దఖలు పడ్డాయి. వాటిని అపరిమితంగా

**వక్ఫ్ బిల్లులోని ముఖ్యాంశాలు...**

| | |
|---|---|
| 1. వక్ఫ్ బోర్డుల్లో ముస్లింలు మాత్రమే సభ్యులుగా ఉంటారు. వక్ఫ్ కౌన్సిల్‌తో పాటు రాష్ట్ర బోర్డుల్లో ఇద్దరు ముస్లిమేతరులకు స్థానం కల్పించాలి. | 5. ఏదైనా ఆస్తి వక్ఫ్ బోర్డుదా, కాదా అన్న వివాదం తలెత్తితే దానిపై ప్రభుత్వం నియమించే ఉన్నతాధికారి నిర్ణయమే అంతిమం. |
| 2. వక్ఫ్ బోర్డులో కనీసం ఇద్దరు మహిళలుండటం కూడా తప్పనిసరి | 6. నూతన వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చిన ఆర్నెల్లలోపు ప్రతి వక్ఫ్ ఆస్తినీ సెంట్రల్ డేటాబేస్‌లో విధిగా నమోదు చేయించాలి |
| 3. వక్ఫ్ ట్రిబ్యునల్ తీర్పులను 90 రోజుల్లోగా హైకోర్టులో సవాలు చేయవచ్చు. | 7. ఇప్పటిదాకా ముస్లిమేతరులు కూడా వక్ఫ్ బోర్డులకు విరాళాలు, దానాలు ఇవ్వవచ్చు. ఇకపై కనీసం ఐదేళ్లుగా ఇస్లాంను అనుసరిస్తున్న వాళ్లు మాత్రమే వక్ఫ్ బోర్డులకు దానాలివ్వడానికి అర్హులు. |
| 4. వక్ఫ్ ట్రిబ్యునల్‌లో జిల్లా జడ్జితో పాటు రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి స్థాయి ఉన్నతాధికారి కూడా ఉండాలి. | |

పెంచుతూ యూపీఏ ప్రభుత్వం 2013లో మరిన్ని సవరణలు చేసింది. దేశవ్యాప్తంగా 8.7 లక్షలకు పైగా వక్ఫ్ ఆస్తులున్నాయి! వీటన్నింటికీ కలిపి 9.4 లక్షల ఎకరాలున్నాయి! ఆ లెక్కన వక్ఫ్ బోర్డులు దేశంలో మూడో అతి పెద్ద భూ యజమానులుగా అవతరించాయి. వాటి భూముల మొత్తం విలువ కనీసం రూ.1.2 లక్షల కోట్ల పై చిలుకేనని అంచనా. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 30 వక్ఫ్ బోర్డులున్నాయి. వాటిలో అవినీతి తీవ్ర సమస్యేనని ముస్లిం సంఘాలు కూడా అంగీకరిస్తున్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారమే దేశవ్యాప్తంగా 60 వేలకు పైగా వక్ఫ్ స్థలాలు అన్యాక్రాంతమయ్యాయి. 13 వేలకు పైగా ఆస్తులు కోర్టు వివాదాల్లో ఉన్నాయి. ఇక 4.35 లక్షల ఆస్తుల గురించి సమాచారమే లేదు! వక్ఫ్ భూములను రక్షించాల్సిన ప్రభుత్వమే వాటిని అన్యాక్రాంతం చేస్తోందని సచార్ కమిటీ ఆక్షేపించింది కూడా. అయితే

**బిల్లుపై అభ్యంతరాలివీ...**

- వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులకు, షియా, బోహ్రా, ఆగాఖానీ, ఓబీసీ వర్గాలకు కూడా ప్రాతినిధ్యం కల్పించడం తమ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం.
- ఇది మత సంస్థలైన వక్ఫ్ బోర్డులను లౌకికీకరించే ప్రయత్నమే. ధార్మిక, సేవా కార్యక్రమాలకు సంస్థలను ఏర్పాటు చేసుకోవడం, నిర్వహించుకోవడం ఆర్టికల్ 26 ద్వారా రాజ్యాంగం కల్పించిన మతపరమైన హక్కును ఇది కాలరాస్తోంది.
- ఇతర మతాలకు చెందిన బోర్డులకు కూడా ఇదే ప్రాతిపదికను వర్తింపజేసి వాటిలో ముస్లింలను నియమిస్తారా?
- వక్ఫ్ బోర్డుల పనితీరును పారదర్శకంగా, మరింత సమర్థంగా మార్చేందుకే బిల్లు తెచ్చామని చెబుతున్నా, అందుకు ఏం చేస్తారో బిల్లులో ఎక్కడా ప్రస్తావన కూడా లేదు.
- ప్రతి వక్ఫ్ ఆస్తినీ ఆర్నెల్లలోపు సెంట్రల్ డేటాబేస్‌లో విధిగా నమోదు చేయని పక్షంలో వాటికి సంబంధించిన వివాదాల్లో కోర్టులను ఆశ్రయించే వీలుండదనడం దారుణం. అత్యధిక వక్ఫ్ ఆస్తులు దశాబ్దాల తరబడి వారి అనుభవంలో ఉన్నాయి. అలాంటి వాటిని ఆర్నెల్లలోగా నమోదు చేసుకోవడమెలా సాధ్యం?
- పేద ముస్లింలకు న్యాయం చేయాలన్న చిత్తశుద్ధి మోదీ సర్కారుకు ఉంటే ప్రస్తుత వక్ఫ్ చట్టాన్ని మరింత మెరుగుపరచాల్సింది. తద్వారా ఫెసిలిటేటర్‌గా వ్యవహరించాల్సింది పోయి వక్ఫ్ ఆస్తులపై హక్కులను లాక్కునేందుకు ప్రయత్నిస్తోంది.
- చిరకాలంగా మత, సేవాపరమైన కార్యక్రమాలకు వాడే ఆస్తిని సరైన డాక్యుమెంట్లు లేకున్నా వక్ఫ్ ఆస్తిగానే పరిగణించే 'వక్ఫ్ బై యూజర్'నిబంధన రద్దు ప్రతిపాదన కూడా సరికాదు.
- ఏదైనా ఆస్తి వక్ఫ్ బోర్డుకు చెందుతుందా, ప్రభుత్వానికా అన్న వివాదం తలెత్తితే దానిపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారి నిర్ణయమే అంతిమమన్న ప్రతిపాదనా వివక్షాపూరితమే. ఎందుకంటే ఆ తీర్పు ప్రభుత్వానికే అనుకూలంగా ఉంటుంది.
- వక్ఫ్ భూముల వివాదాలపై వక్ఫ్ ట్రిబ్యునల్ తీర్పు ఇప్పుడు అంతిమం కాదు. కోర్టుల్లో సవాలు చేయవచ్చు. అయినా పనిగట్టుకుని ఆ మేరకు కొత్తగా ప్రతిపాదన చేయడం వెనక దురుద్దేశాలు దాగున్నాయి.
- వక్ఫ్ ట్రిబ్యునల్‌లో జిల్లా జడ్జి, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారి ఉండాలనడం కూడా వాటిపై పెత్తనం చెలాయించే ప్రయత్నమే.

**ప్రభుత్వ వాదన**

- వక్ఫ్ బోర్డుల్లో అవినీతిని రూపుమాపి వాటి ఆస్తుల వినియోగంలో పూర్తి పారదర్శకత తీసుకురావడం.
- ఆగాఖానీలు, బోరాలు, పస్మాందా ముస్లింలు, ముస్లిం మహిళలకు కూడా వక్ఫ్ ఆస్తుల్లో సముచిత భాగస్వామ్యం కల్పించాం.
- వక్ఫ్ ఆస్తుల నమోదును తప్పనిసరి చేయడం వల్ల వాటి దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయవచ్చు.
- వక్ఫ్ బోర్డుల్లో మహిళలకు కూడా విధిగా స్థానం కల్పించడం ద్వారా లింగ సమానత్వం సాధ్యపడుతుంది.
- వక్ఫ్ ఆస్తులను డిజిటైజ్ చేయడం ద్వారా ఆర్థిక అవకతవకలను అడ్డుకట్ట పడుతుంది.
- ముస్లిం దేశాల్లో కూడా వక్ఫ్ ఆస్తులపై ప్రభుత్వ పర్యవేక్షణ, నియంత్రణే ఉంటుంది.

తీవ్ర వాద వివాదాల నడుమ వక్ఫ్ సవరణ బిల్లును లోక్‌సభ బుధవారం ఆమోదించింది. కేంద్ర వక్ఫ్ మండలి, రాష్ట్ర వక్ఫ్ బోర్డుల ఏర్పాటుకు ఈ బిల్లు వీలు కల్పిస్తోంది. ఈ బిల్లు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నది విపక్షాల ఆరోపణ. దీన్ని వక్ఫ్ భూములను ముస్లింల నుంచి లాక్కునేందుకు మోదీ సర్కారు కుట్రగా మజ్లిస్ వంటి పార్టీలు అభివర్ణిస్తున్నాయి. ఇందులోని పలు ప్రతిపాదనలు 14, 26, 26, 29 తదితర ఆర్టికల్స్‌కు పూర్తిగా విరుద్ధమని వాదిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వక్ఫ్ రగడపై ఇండియాటుడే న్యూస్ చానల్ కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్ బుధవారం చర్చా కార్యక్రమం నిర్వహించారు. బిల్లుకు అనుకూలంగా, వ్యతిరేకంగా పలు పార్టీల నేతలు తదితరులు, నిపుణులు వాదనలు విన్పించారు. వక్ఫ్ ఆస్తులు అంతిమంగా పేద ముస్లింల అభ్యున్నతికి దోహదపడాలన్నదే తాజా బిల్లు ఉద్దేశమని ప్రభుత్వం చెబుతుండగా అందులోని ప్రతిపాదనలను అంశాలవారీగా విపక్షాలు దుయ్యబట్టాయి.

## బేకరీలన్నీ మూసివేత అంతర్జాతీయ సాయానికి ఇజ్రాయెల్ మోకాలడ్డు

# గాజాలో ఆకలి కేకలు- పిండీ లేదు.. తిండీ లేదు



రంజాన్ పండుగతో పాటే ప్రపంచవ్యాప్తంగా ముస్లింల ఉపవాస దీక్షలు ముగిసినా గాజాలో మాత్రం పాలస్తీనియన్లకు నిత్య ఉపవాసాలే కొనసాగుతున్నాయి. తినడానికి ఏమీ లేక ఖాళీ జనం డొక్కలెండుతున్నాయి. గాజాకు మానవతా సాయాన్ని, ఆహార సరఫరాను ఇజ్రాయెల్ పూర్తిగా అడ్డుకోవడంతో పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడింది. ఐరాసతో పాటు అంతర్జాతీయ సమాజం భారీ పరిమాణంలో పంపిన ఆహార నిల్వలన్నీ సరిహద్దుల వద్దే కుళ్లిపోతున్నాయి. గాజా ఏమో నిస్సహాయ స్థితిలో ఆకలితో యుద్ధం చేస్తోంది. రంజాన్ పండుగ సందర్భంగా కూడా కనీసం రొట్టెముక్కయినా దొరకని కుటుంబాలెన్నో...! ఇది చాలదన్నట్టు పిండి నిల్వలు కూడా పూర్తిగా నిండుకోవడంతో తాజాగా గాజాలో బేకరీలన్నీ మూతబడ్డాయి!! ఈద్. పవిత్ర రంజాన్ మాసానికి ముగింపు. సాధారణంగా అయితే గాజావాసులకూ వేడుకే. కుటుంబాలన్నీ కలిసి ఆనందంగా పండుగ జరుపుకొంటాయి. కానీ గతేడాది మాదిరిగానే ఈసారి కూడా అక్కడ ఈద్ పాలస్తీనావాసుల ఆకలి కేకలు, ఇజ్రాయిల్ బాంబు దాడుల నడుమే ముగిసింది. యుద్ధం దెబ్బకు గాజా ఆహారోత్పత్తి సామర్థ్యం పూర్తిగా పడకేసింది. దాంతో తిండికి కూడా అంతర్జాతీయ సాయంపైనే ఆధారపడుతోంది. ఇజ్రాయెల్ మాత్రం తమ బందీల విడుదల కోసం హమాస్‌పై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాల్లో భాగంగా మార్చి నుంచే గాజాకు ఆహారం, మానవతా సాయం సరఫరాను పూర్తిగా నిలిపివేసింది. దాంతో సహాయక ట్రక్కులు గాజాలో అడుగు పెట్టి మూడు వారాలు దాటింది. 18 నెలల క్రితం యుద్ధం మొదలైనప్పటి నుంచీ గాజాకు ఇంతకాలం పాటు ఎలాంటి ఆహార సరఫరాలూ అందకపోవడం ఇదే తొలిసారి. దాంతో ఇంధనం తదితరాల కొరత తారస్థాయికి చేరింది. అంతేకాదు, కనీసం పిండి నిల్వలు కూడా లేని పరిస్థితి! దాంతో బుధవారం గాజాలోని బేకరీలన్నీ మూతబడ్డాయి. స్థానిక బేకరీ యజమానుల సంఘం చీఫ్ అబ్దెల్ నాసర్ అల్-అజ్రామి ఈ మేరకు ప్రకటించారు. "గిడ్డంగుల్లో పిండి పూర్తిగా అయిపోయినట్టు వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం (డబ్ల్యూఎఫ్‌పీ) మాకు తెలిపింది. ఇజ్రాయిల్ రఫా క్రాసింగ్ తదితరాలను తెరిచి సహాయక సామగ్రి, మానవతా సాయాలను తిరిగి గాజాలోకి అనుమతించేదాకా బేకరీలు పనిచేయబోవు"అని వెల్లడించారు.

### అబద్ధాలతో నిద్రపుచ్చుతూ...

పాలస్తీనియన్ల ఆకలిని తీరుస్తున్న ప్రధాన వనరు రొట్టె మాత్రమే. చికెన్, మాంసం, కూరగాయలు అందుబాటులో లేకపోవడమే ఇందుకు కారణం. అందుబాటులో ఉన్న ఇతర ఆహార పదార్థాలను రొట్టెను తింటూ రోజులు వెళ్లదీస్తున్నారు. "పరిస్థితి వివరించలేనంత దారుణంగా ఉంది. నా కుటుంబసభ్యులకు బ్రెడ్ కోసం ఉదయం 8 గంటల నుంచీ వెతుకుతున్నాను. డెయిర్ అల్-బలాహ్‌లోని అన్ని బేకరీల చుట్టూ తిరిగా. ఒక్కటి కూడా పనిచేయడం లేదు. పిండి లేదు. కట్టె లేదు. ఏమీ లేవు. కనీసం తాగేందుకు నీళ్లు కూడా లేవు. ఇంత దారుణం చూస్తామని ఎన్నడూ అనుకోలేదు"అని ఇబ్రహీం అల్ కుర్ద్ అనే స్థానికుడు వాపోయాడు. "పిల్లలు రాత్రి భోజనం చేయకుండానే పడుకుంటున్నారు. ఈ ఒక్క రాత్రికి ఓపిక పట్టండి, ఉదయాన్నే పిండి తెచ్చుకుందామని వారికి అబద్ధాలు చెబుతూ నిద్రపుచ్చుతున్నాం"అంటూ కన్నీటిపర్యంతమయ్యాడు. రఫా తదితర క్రాసింగ్‌లను తిరిగి తెరిచేలా ఇజ్రాయెల్‌పై అంతర్జాతీయ సమాజం ఒత్తిడి తేవాలని ఆయన వేడుకుంటున్నాడు.

### చుక్కల్లో పిండి ధరలు...

రొట్టెతో పాటు గాజావాసులకు వంట కోసం గ్యాస్‌ను కూడా బేకరీలే అందించేవి. అవి మూతబడటంతో తిండి వండుకోవడానికి కలపనే ఆశ్రయిస్తున్నారు. కానీ దానికీ తీవ్ర కొరతే ఉంది. కలపను బ్లాక్ మార్కెట్లో అడ్డగోలు ధరలకు అమ్ముతున్నారు. దాంతో అదీ జనానికి అందుబాటులో లేకుండా పోయింది. నూనె, ఈస్ట్ వంటి బేకింగ్ పదార్థాలు కూడా కొనలేని పరిస్థితి! బేకరీలు మూతబడటంతో పిండి ధరలకు అమాంతం రెక్కలొచ్చాయి. ఒక్క సంచీ ఏకంగా 400 షెకెల్స్ (115 డాలర్ల)కు అమ్ముతున్నారు. యుద్ధానికి ముందు 25 షెకెల్స్ ఉండేది. గత జనవరిలో స్వల్పకాలిక కాల్పుల విరమణ సందర్భంగా కూడా 35 షెకెల్స్‌కు దొరికేది. "ప్రజలు ఇప్పుడు యుద్ధ భయాన్ని, బాంబు దాడులను, వలస కష్టాలను, అన్నింటినీ మర్చిపోయారు. వారి ఆలోచనలన్నీ ఏ పూటకు ఆ పూట పిండి ఎలా దొరుకుతుందా అన్నదాని మీదే ఉన్నాయి"అని ఉత్తర గాజాకు చెందిన ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ అహ్మద్ డ్రెమ్లీ ఆవేదన వెలిబుచ్చారు. "యుద్ధం మొదలైనప్పుడు ప్రజలు ఆరోగ్యంగా, దేన్నయినా తట్టుకునే సామర్థ్యంతో ఉన్నారు. ఇప్పుడంతా మారిపోయింది. రొట్టెకు కూడా దిక్కు లేదు! దాంతో జనం ఏది దొరికినా తిని కడుపు నింపుకుంటున్నారు. కానీ కొద్ది రోజులుగా చాలామందికి తినేందుకు ఏమీ దొరకడం లేదు. బియ్యం కొనడానికి అప్పు చేస్తున్నారు. ఇంట్లో ఉన్నవన్నీ అమ్ముకుంటున్నారు. చాలామంది పాలస్తీనియన్లు రద్దీగా ఉన్న గుడారాల్లో బతుకీడుస్తున్నారు. కొందరైతే వీధుల్లోనే నిద్రపోతున్నారు. తిండి వండుకునే పరిస్థితులు కూడా లేవు"అంటూ గాజాలోని దైన్యాన్ని ఆయన వివరించారు.

### దారుణ సంక్షోభం: ఐరాస

"కాల్పుల విరమణ సమయంలో గాజాలోకి రోజుకు 500 నుంచి 600 ట్రక్కుల్లో సహాయక సామగ్రి వచ్చేది. ఇప్పుడన్నీ ఆగిపోయాయి. కాల్పుల విరమణ ముగిసి యుద్ధం తిరిగి మొదలైనప్పటినుంచీ ఘోరమైన మానవతా సంక్షోభం నెలకొంది. మార్చి 2 నుంచి గాజాలోకి మానవతా సాయాన్ని ఇజ్రాయెల్ పూర్తిగా ఆపేసింది. ముఖ్యంగా బేకరీల మూతతో ఆహారం కోసం కేవలం వాటిపైనే ఆధారపడ్డ లక్షలాది మంది అల్లాడుతున్నారు. దిగ్బంధాన్ని తక్షణం ఎత్తేయకపోతే గాజాలో త్వరలోనే మరణమృదంగం తప్పదు"అని ఐక్యరాజ్యసమితి పాలస్తీనా శరణార్థుల ఏజెన్సీ (యూఎన్‌ఆర్డబ్ల్యూఏ) కమిషనర్ జనరల్ ఫిలిప్ లజారి హెచ్చరించారు.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com